RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

09 డిసెంబర్ 2024 సోమవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:162

## జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం...



# తెలంగాణ తల్లి

ప్రారంభకులు :
గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ. ఎ. రేవంత్ రెడ్డి గారు

తేదీ : 09 డిసెంబర్, 2024
సమయం : సాయంత్రం 6 : 05 గం.లకు,
స్థలం : డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ప్రజాబలం


09 డిసెంబర్ 2024 సోమవారం

# చెరకు రైతుల రాయితీలపై వేటు!

రైతాంగ ప్రయోజనాలకు హరించే విధంగా మోడీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవటం, విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల ధరలు పెంచటం, ఎరువుల ధరల నిర్ణయ అధికారం ఎరువుల కంపెనీలకే ఇవ్వటం, పోషకాలను బట్టి ఎరువుల సబ్సిడీ ఇవ్వటం, ధాన్యం సేకరణ నుంచి ఎఫ్‌సిఐని తప్పించటం, వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి సంస్థలకు అవకాశం కల్పించటం, ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూముల సర్వే చేయించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టటం, రైతుల మోటార్లకు కరెంట్ మీటర్లు బిగించమని రాష్ట్రాలకు చెప్పటం లాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసింది. తాజాగా చెరకు రైతులకు ప్రయోజనంగా ఉన్నవాటిని ఉపసంహరిస్తూ ఆర్డర్ జారీ చేసింది. మోడీ ప్రభుత్వ విధానాలవల్ల చెరకు రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఆ సంక్షోభం ఇంకా ఎక్కువ అయ్యేలా మోడీ ప్రభుత్వలోని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ 1966 షుగర్ (నియంత్రణ) ఆర్డర్, 2018 నాటి చక్కెర నియంత్రణ ఆర్డర్‌ను కలిపి ది షుగర్ (నియంత్రణ) ఆర్డర్ 2024 ముసాయిదాను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఉత్పత్తి ప్రక్రియలో సాంకేతిక పురోగతి, పరిశ్రమలో మార్పులను పేర్కొంటూ 2024 ముసాయిదా విడుదల చేసినట్లు చెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందటానికి పంచదార రికవరీ రేటును 8.5% నుంచి 10%కి కొత్త ముసాయిదాలో పెంచటం జరిగింది. భారత దేశంలో రికవరీ రేట్ రీడింగ్‌ను సక్రమంగా తెలిపే మిషన్లు లేని కారణంతో పాటు, రికవరీని పెంచే నాణ్యమైన విత్తనం అందక పోవటం వల్ల కొత్త ముసాయిదాలో పేర్కొన్న 10% రికవరీ రేటు రాని పరిస్థితుల్లో రైతులు మద్దతు ధర పొందలేరు. దేశంలో పంచదార రికవరీ 9.% మించి ఎప్పుడు రాలేదు. 2024 నవంబర్ మొదటి వారంలో 8.82% మాత్రమే ఉంది. బ్రెజిల్ లాంటి కొన్ని దేశాల్లో 11 నుంచి 14% పైగా పంచదార రికవరీ వస్తుంది. షుగర్ (నియంత్రణ) ఆర్డర్ 1966లోని సెక్షన్ 5ఎ, చక్కెర మిల్లుల ద్వారా వచ్చే లాభాల నుండి అదనపు ధర వాటా పొందేందుకు రైతులకు వీలు కల్పించింది. ఇప్పుడు ఆ నిబంధన తొలగించటంతో లాభాలను పంచకుండా తప్పించుకుంటున్న మిల్లులకు వరంలా దొరికింది. ప్రభుత్వం ప్రకటించిన ధరతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా సలహా (ఎస్‌ఎపి) ధరను ప్రకటించటానికి 1966 ముసాయిదాలో వీలు కల్పించిన నిబంధనను కూడా కేంద్ర ప్రభుత్వ కొత్త ఆర్డర్ ముసాయిదా తొలగించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక మరికొన్ని రాష్ట్రాలు 2 నుండి 5 వందల వరకు సలహా ధరను ప్రకటిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కొన్ని సంవత్సరాలు 200 సలహా ధరను ప్రకటించింది. కొత్త షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ప్రకారం రాష్ట్రాలు సలహా ధరను ప్రకటించలేవు. చక్కెర మిల్లులు బ్యాంకుల్లో తనకా పెట్టిన పంచదార అమ్ముకోవటానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పక చక్కని కొత్త ముసాయిదాలో పేర్కొన్నారు. ఫలితంగా చెరకు కొనుగోలు చేసిన 14 రోజుల లోపు మిల్లులు డబ్బులు చెల్లించాలన్న నిబంధన నిరుపయోగంగా మారింది. రైతులకు డబ్బులు ఎప్పుడు చెల్లించాలన్న అధికారం మిల్లులకు దక్కింది. చెరకు విక్రయ డబ్బులు పొందటానికి మిల్లర్ల దయపై రైతులు ఆధార పడాల్సి వస్తుంది. ప్రపంచంలోని 195 దేశాల్లో 124 దేశాలు చెరకు పండిస్తున్నారు. భారత దేశంలో 50 లక్షల ఎకరాల్లో చెరకు సేద్యం జరుగుతున్నది. చక్కెర తయారీ పరిశ్రమలకే కాకుండా, కాగితం, మద్యం, పశువుల దాణా, రసాయనాల తయారీకి ముడి పదార్థాల ఉత్పత్తిని చెరకు సేద్యం అందిస్తుంది. ఎకరాకి సగటు దిగుబడి 30 టన్నుల వస్తుంది. ఎకరాకు సేద్యానికి అన్ని రకాల సేద్యపు ఖర్చు లక్ష దాకా ఉంది. కౌలు రైతుకు అదనంగా మరో 20 వేలు ఖర్చుగా పెట్టాలి. నీతిఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలోని వ్యవసాయ పరిశ్రమల్లో చక్కెర పరిశ్రమ రెండవ పెద్ద పరిశ్రమ. చక్కెర ఉత్పత్తిలో బ్రెజల్ మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండవ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 5.60 లక్షల ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేస్తున్నారు. దేశంలో లక్షలాది రైతు కుటుంబాలకు జీవనోపాధిగా ఉండి, ఎందరికో ఉపాధి కల్పిస్తూ, పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న చెరకు రైతాంగం ఎడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర చెరకు రైతులకు ఏమాత్రం మేలు చేయలేదు. దిగుబడి ఎకరాకు 30 టన్నులు. ప్రభుత్వ చెప్పే క్వింటాల్ చెరకు ఉత్పత్తి ఖర్చు 157 రూపాయలు. వాస్తవ ఖర్చు 305 రూపాయలు. కేంద్రం ప్రకటించిన క్వింటాల్ మద్దతు ధర 350 రూపాయలు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ ఖర్చుపై 50% పెంచితే 450 ప్రకటించాలి. 10% పంచదార రికవరీ వచ్చే చెరకుకి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. అంతకన్నా తక్కువ రికవరీ వస్తే తగ్గిన దాని ప్రకారం మద్దతు ధరలో కోత పడుతుంది. మద్దతు ధర ప్రకారం 30 క్వింటాళ్లు వచ్చిన రైతుకు లక్షా, ఐదు వేల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం సొంత భూమి రైతుల ఖర్చులకు సరి పోవటం లేదా నామమాత్రపు మిగులు ఉంటుంది. కౌలు రైతులకు పెట్టుబడి కూడా రాదు. టన్ను చెరకు ద్వారా 280 కిలోల పంచదార లభిస్తుంది. కేజీ 30 చొప్పున 8680 రూపాయలు వస్తుంది. మద్దతు ధర ప్రకారం టన్ను చెరకు ద్వారా రైతుకు లభించేది 3500 రూపాయలు. మిల్లు యజమానులకు మిగులుతున్నది 5,180 రూపాయలు. ఎకరం చెరకు పైన మిల్లు యజమాని 1,60,580 రూపాయలు మిగులు పొందుతాడు. ఫ్యాక్టరీ ఖర్చుల కింద 50 వేలు తీసేసినా లక్షకు పైగా మిగులుతుంది. దేశంలో 453 చక్కెర మిల్లులు ఉంటే, వాటిల్లో 252 సహకార రంగంలో, 67 ప్రభుత్వ రంగంలో ఉంటే, 134 ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. సహకార, ప్రభుత్వ పంచదార మిల్లులను ప్రోత్సహించాల్సి మోడీ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వాటిని మూసివేయటం లేదా అమ్మివేయటం చేస్తున్నది. చెరకు రంగమంతా నేడు ఎక్కువగా ప్రైవేట్ పరిశ్రమల చేతుల్లో ఉంది. రైతులు, ప్రైవేట్ మిల్లులకే 90% చెరకు విక్రయిస్తున్నారు. మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువ ఇస్తూ రైతాంగాన్ని దోసుకుంటున్నారు. సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సంవత్సరాల తరబడి వేలాది రూపాయలు రైతులకు బకాయిలు పెట్టారు. ప్రస్తుతం రూ. 5 వేల కోట్ల దాక రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి మిల్లులు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోకుండా మిల్లు యజమానుల ప్రయోజనాల కోసం తానే హామీ ఉండి వేలాది కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించింది. రైతాంగం మాత్రం అప్పుల్లో కూరుకుపోయారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నష్టదాయకంగా మారటంతో చెరకు సేద్యం ఎడల రైతుల్లో విముఖత ఏర్పడి లక్షలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా 2022లో పంచదార ఉత్పత్తి 328.7 లక్షల టన్నులు ఉండగా, 2023 నాటికి 311 లక్షల టన్నులకు తగ్గింది. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి రైతాంగం సాగు నుండి తప్పుకునేలా చేసి, చెరకు పంటను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, పంచదారను విదేశాల నుంచి మోడీ ప్రభుత్వం దిగుమతి చేసుకోనుంది. ఇప్పటికే 3 లక్షల టన్నుల దేశంలోకి దిగుమతి అయింది.

మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది చెరకు రైతులు ఉద్యమించాలి. 2924 షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ముసాయిదాను ఉపసంహరించాలని, టన్నుకు చెరకుకు 4,775 రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేయాలి.

# ప్రధాని బార్నియర్ రాజీనామా



పారిస్: ప్రధానమంత్రి రాజీనామాతో ఫ్రెంచ్ రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మిచెల్ బార్నియార్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. మొత్తం 577 స్థానాలున్న పార్లమెంటులో 331 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపడంతో బార్నియర్‌కు ఘోర పరాభవం ఎదురైంది. ఫ్రాన్స్ చరిత్రలో అతి తక్కువ కాలం పాటు ప్రధానిగా ఉన్న వ్యక్తిగా బార్నియర్ నిలిచాడు. ఇప్పుడతని స్థానంలో కొత్త ప్రధానిని నియమించేందుకు అధ్యక్షుడు మాక్రాన్ కసరత్తు ప్రారంభించారు. సౌదీ అరేబియాలో పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన బార్నియర్ శుక్రవారం తన రాజీనామా లేఖను అధ్యక్షుడి ఆమోదానికి పంపారు. బడ్జెట్‌లో సామాజిక భద్రతకు నిధుల కోత పెట్టే పలు పొదుపు చర్యలను ప్రభుత్వం ప్రతిపాదించడంతో అన్ని వైపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పార్లమెంటు ఆమోదంతో నిమిత్తం లేకుండా కార్యనిర్వాహక అధికారాలను ఉపయోగించి బడ్జెట్ ఆమోదం పొందినట్లు ప్రభుత్వం ప్రకటించుకుంది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన రాడికల్ లెఫ్ట్, పచ్చి మితవాది మేరీ లీపెన్ నాయకత్వంలనో నేషనల్ ర్యాలీ పార్టీలు రెండూ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో ప్రభుత్వం పతనమైంది. ఇది బార్నియర్ ప్రభుత్వ వైఫల్యం మాత్రమే కాదు, అధ్యక్షుడు మాక్రాన్ వైఫ్యలం కూడా. అందుకే అధ్యక్షుడిగా మాక్రాన్ కూడా తప్పుకోవాలన్న డిమాండ్ ఊపందుకుంది. దేశ అభివృద్ధికి పెద్ద అడ్డంకి మాక్రానేనని రాడికల్ లెఫ్ట్ పార్టీ నాయకుడు మెథిల్డే పనోట్ అన్నారు. బార్నియర్ నిష్క్రమణ మాక్రాన్ ప్రభుత్వ దుర్బలత్వాన్ని తెలియజేస్తోంది. మాక్రాన్ మాత్రం తన పదవీ కాల పరిమితి పూర్తయ్యే దాకా గద్దె దిగే ప్రసక్తే లేదంటున్నారు. అధ్యక్షునిగా మాక్రాన్ పదవీ కాల పరిమితి 2025 సంవత్సరంలో ముగుస్తుంది. పార్లమెంటరీ మెజార్టీ లేకుండా ఎన్నికైన అతని ప్రభుత్వం బడ్జెట్‌ను ఆమోదించడానికి బలహీనమైన పొత్తులపై ఆధారపడింది. ఈ ఎత్తుగడ ఇప్పుడు బెడిసికొట్టింది.

# యూన్ అధికారాల నిలిపివేత.. పాలక పార్టీ మద్దతు

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్‌సుక్ యేల్ రాజ్యాంగ అధికారాల నిలిపివేతకు పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి) చీఫ్ హన్ డాంగ్ హున్ శుక్రవారం మద్దతు తెలిపారు. యూన్ అధ్యక్ష బాధ్యతలు, అధికారాన్ని వెంటనే నిలిపివేయాల్సి వుందని పార్టీ సమావేశంలో పేర్కొన్నారు. యూన్ తిరిగి మార్షల్ లాను విధించేందుకు యత్నించడం వంటి విపరీత చర్యలకు దిగే ప్రమాదం ఉందని, ఇది పౌరులను ప్ర మాదంలో పడేస్తుందని అన్నారు. సైనిక చట్ట అమలు సమయంలో దేశ వ్యతిరేక కార్యకలాపాలు ఆరోపణల ఆధారంగా కొందరు కీలక నేతలను అరెస్ట్ చేసి, నిర్బంధించాల్సిందిగా యూన్ దేశ డిఫెన్స్ కౌంటర్‌ఇంటెలిజెన్స్ కమాండర్ (డిసిసి)ని ఆదేశించినట్లు తమకు నిఘా సమాచారం అందిందని హాన్ తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దాని ప్రజలను రక్షించడానికి అధ్యక్షుడు యూన్‌సుక్ యేల్ అధికార బాధ్యతలను తక్షణమే నిలిపివేయడం అత్యవసరమని తాను నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మార్షల్ లా విధించడం రాజ్యాంగ విరుద్ధం అని గతంలో హాన్ వాదించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు ఇప్పటికే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీనిపై చర్చ అనంతరం శనివారం ఓటింగ్‌కు వెళ్లనుంది.



# ఉక్రెయిన్ సంఘర్షణకు బైడెనే కారణం



2022లో అమెరికా జోక్యం ఉక్రెయిన్ వివాదానికి దారితీసిందని హంగేరియన్ ప్రధాని విక్టర్ ఓర్బన్ అన్నారు. వివాదానికి సంబంధించిన విధానంలో వాషింగ్టన్‌కు "కామన్‌సెన్స్ గానీ, సంయమనంగానీ లేవని" మాస్కో ఆరోపించిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ కొసుత్ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఓర్బన్ ఈ వివాదంలో అమెరికా నిర్ణయాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. "ఈ యుద్ధంలో ప్రధాన ఆటగాళ్లలో అమెరికా ఒకటి. అమెరికా లేకుండా అసలు ఈ యుద్ధం జరిగేదే కాదు. అమెరికా మద్దతు లేకుండా ఉక్రెయిన్ ప్రతిఘటించేది కాదు" అని మాగ్యార్ నెమ్ జెట్ వార్తా పత్రికను ఉటంకిస్తూ ప్రధాని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారం, సెప్టెంబర్ 30 నాటికి వాషింగ్టన్ ఉక్రెయిన్ కోసం దాదాపు 183 బిలియన్ల సహాయాన్ని కేటాయించింది. ప్రస్తుత అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ సంఘర్షణ స్థాయిని పెంచాలనుకుంటున్నారని, అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ "శాంతి అనుకూలుడు" అని ఓర్బన్ అన్నారు. ఈ వారం ప్రారంభంలో, అమెరికా విదేశాంగ శాఖ కీవ్ కోసం 725 మిలియన్ల సహాయాన్ని ప్రకటించింది. ఇందులో ఎయిర్-డిఫెన్స్ సామర్థ్యాలు, రాకెట్ సిస్టమ్‌లు, ఫిరంగి దళాల కోసం ఆయుధాలు, ట్యాంక్ వ్యతిరేక ఆయుధాలు ఉన్నాయి. అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ఇటీవల కీవ్‌ను సైన్యంలో చేరేందుకు కనీస నిర్బంధ వయస్సును 25 ఏండ్ల నుంచి తగ్గించాలని పిలుపునిచ్చారు. దీనిని "భయంకరమైనది, ఎందుకంటే ఇంకా ఎక్కువ మంది ఉక్రేనియన్లు చనిపోతారు" అని ఓర్బన్ అభివర్ణించారు.అమెరికన్ విధానాలు మారడానికి ఇది సమయం ఎందుకంటే అవి "స్థిరమైనవి" అని ఓర్బన్ వాదించారు. హంగేరీ "ఈ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే డోనాల్డ్ ట్రంప్ లక్ష్యం త్వరగా వాస్తవ రూపం దాల్చేలా గట్టిగా ఒత్తిడి చేస్తోంది" అని గురువారంనాడు హంగేరీ విదేశాంగ మంత్రి పీటర్ స్జిజార్టో అన్నారు. ఉక్రెయిన్‌లో శాంతిని సాధించడంలో విఫలమైతే సమస్య నిత్యం తీవ్రతరమయ్యే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించారు.

# విపత్తు కోసం కేంద్రం ఎలాంటి సహాయం అందించలేదు



సిమ్లా: విపత్తు సహాయార్థం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడం లేదని హిమాచల్ ప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ మంత్రి విక్రమాదిత్య సింగ్ ఆరోపించారు. హిమాచల్‌కు అందాల్సిన నిధులు రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర పథకాల్లో భాగమేనని మంత్రి అన్నారు. ఇతర విపత్తులకు గురైన రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం అందించామని, అయితే హిమాచల్‌ను తిరస్కరించామని ఆయన అన్నారు. విక్రమాదిత్య సింగ్ విలేకరులతో మాట్లాడుతూ హిమాచల్‌కు కేంద్ర కేబినెట్‌లో సీనియర్ మంత్రి ఉన్నారని, బిజెపి జాతీయ అధ్యక్షుడిగా కూడా ఉన్న ఆయన హిమాచల్ బాధితుల కోసం పోరాడాలని అన్నారు. వచ్చే రెండేళ్లలో అన్ని గ్రామాలను రోడ్డు మార్గం ద్వారా అనుసంధానించాలని హిమాచల్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డోద్రా-క్వార్, చోటా భంగల్, బారా భంగల్ వంటి చాలా మారుమూల ప్రాంతాలు రోడ్డు మార్గం ద్వారా అనుసంధానించబడతాయని పేర్కొంది. రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతుందన్న సమస్య దేశంలో తరచూ తలెత్తుతోంది. రెండు నెలలుగా బురదజల్లులు, ముండక్కై, చురల్‌మల కొట్టుకుపోయినా.. సాయం చేయని కేంద్ర వైఖరిపై కేరళ కూడా గళం విప్పింది.

RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




09 డిసెంబర్ 2024 సోమవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:162

## హుస్సేన్ సాగర్ తీరంలో అందరినీ అలరించిన ఎయిర్ షో... హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి

విజయోత్సవాల్లో భాగంగా వాయుసేన విమానాలతో విన్యాసాలు

హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు



ట్యాంక్ బండ్ వద్ద ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ వేడుకలలో భాగంగా ఎయిర్-షో ను తిలకించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు.

తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల్లో భాగంగా నేడు హుస్సేన్ సాగర్ తీరంలో ఎయిర్ షో నిర్వహించారు. భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ అడ్వాన్స్ జెట్ ట్రైనర్ విమానాలు ట్యాంక్ బండ్ పై గగనతలంలో అద్భుతమైన విన్యాసాలతో అలరించాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాసరి నేతృత్వంలో నిర్వహించిన ఈ ఎయిర్ షోలో మొత్తం 9 విమానాలు పాల్గొన్నాయి. ఈ వాయుసేన విన్యాసాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు.

## ఈవీఎం విషయంలో ప్రతిపక్ష ఎంవీఏ నేతలు ద్వంద్వ ప్రమాణాలను అవలంభిస్తున్నాయి: ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే



ముంబై, డిసెంబర్ 8)ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) విషయంలో ప్రతిపక్ష ఎంవీఏ నేతలు ద్వంద్వ ప్రమాణాలను అవలంభిస్తున్నారని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదివారం అన్నారు.

"గతంలో జార?ండ్, కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి.. ఇటీవలే ప్రియాంక గాంధీ వయనాడ్ ఉపఎన్నికల్లో గెలుపొందారు, ఇదంతా విపక్షాలకు ఓకే. కానీ ఓడిపోయిన తర్వాత మాత్రం ఈవీఎంలను వ్యతిరేకించడం, అభ్యంతరం చెప్పడం మొదలుపెట్టారు. ద్వంద్వత్వం అని అన్నారు.

శరద్ పవార్ విమర్శలను తిప్పికొట్టినారు, ప్రతిపక్షానికి ఎటువంటి సమస్య లేదని, ప్రజలు ప్రతిపక్షానికి సీటు చూపించారని, ఇంట్లో కూర్చున్న వారికి ఓటు వేయరని అన్నారు. మహాయుతి ప్రభుత్వం రెండున్నరేళ్ల కృషిని ప్రజలు చూశారని, అందుకే మమ్మల్ని గెలిపించారని, అయినా ప్రతిపక్షాలు పతనమైనా అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. అంతకుముందు శరద్ పవార్ ఎన్నికల నిర్వహణ తీరుపై ఎన్సీపీ-శివసేనలను విమర్శించారు.ప్రతిపక్షాలు ఇప్పటికైనా ఏడుపు ఆపాలని, అభివృద్ధి పాటలు పాడాలని అన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. అభివృద్ధి పనుల ప్రాతిపదికన జరిగిన ఎన్నికల్లో మహాయుతిని గెలిపించారన్నారు. లడ్కీ బహిన్ పథకం మహా వికాస్ అఘాదీని ఓడించిందని ఆయన అన్నారు.సుప్రీం కోర్టు నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వరకు తమకు అనుకూలంగా తీర్పు వస్తే ప్రతిపక్షాలు బాగున్నాయని, వ్యతిరేకంగా వస్తే విమర్శిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.వక్ఫ్ బోర్డు జారీ చేసిన నోటీసుకు సంబంధించి.. నిబంధనల ప్రకారం ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో నడుస్తోందని, ఎవరికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు.

మరోవైపు, ఈవీఎంలపై శాసనసభలో, వీధుల్లో పోరాటం చేస్తామని, ఇది ప్రజలు కోరుకునే ప్రభుత్వం కాదని కాంగ్రెస్ నేత నానా పటోలే అన్నారు. నిన్న లాంఛనంగా తాము ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయలేదని పటోలే అన్నారు. అసెంబ్లీ, లోక్‌సభలు ప్రజల మనోభావాలను తెలిపేందుకే ఉన్నాయని, నిన్న ఈ నిరసన తెలిపామని చెప్పారు. లాతూర్‌లోని రైతులకు మహారాష్ట్ర వక్ఫ్ బోర్డు నుంచి నోటీసులు పంపడంపై వ్యాఖ్యానించారు. "ఇది సామాన్య ప్రజల ప్రభుత్వం. అందువల్ల ఈ కేసులో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోం" అని అన్నారు. రైతులకు వక్ఫ్ బోర్డు పంపిన నోటీసులకు సంబంధించి పూర్తి సమాచారం అందలేదన్నారు. నోటీసులు పంపిన భూమి రైతులదేనని, అక్కడ వ్యవసాయం చేస్తుంటే, అది రైతుల పేరుతో ఉంటే వక్ఫ్ బోర్డు చర్యలు తీసుకోదని కాంగ్రెస్ నేత నానా పటోలే అన్నారు.

## ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం... ఏపీకి వర్షసూచన

తూర్పు హిందూ మహాసముద్రాన్ని ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రాష్ట్రానికి వర్ష సూచన చేసింది. ఈ నెల 11, 12 తేదీల్లో రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మరి కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ వివరించింది. రేపు (డిసెంబరు 9) రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని తెలిపింది.కాగా, రాగల 24 గంటల్లో ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా పయనించి మరింత బలపడుతుందని ఐఎండీ అమరావతి విభాగం వెల్లడించింది. ఇది బుధవారం నాటికి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని తెలిపింది. ప్రస్తుతం అల్పపీడన ప్రాంతానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కూడా కొనసాగుతోందని వివరించింది.

## తెలంగాణ తల్లి రూపం మార్పుపై తొలిసారిగా స్పందించిన కేసీఆర్

**డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న కాంగ్రెస్ సర్కారు**

**విగ్రహం రూపంపై విమర్శలు**

**తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్పు అవివేకంతో కూడిన చర్య అన్న కేసీఆర్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి రూపం మార్పు అంశం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారిగా స్పందించారు. ఇవాళ ఎర్రవల్లి ఫాంహౌస్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమైన కేసీఆర్... తెలంగాణ తల్లి విగ్రహం అంశంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్పు అవివేకంతో కూడిన చర్య అని అన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోవాల్సిన ప్రభుత్వం... మూర?త్వంతో ఇలా విగ్రహం మార్పులు చేసుకుంటూ పోతే ఎలా? అని విమర్శించారు.

అసెంబ్లీ, మండలి సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ అంశాన్ని ప్రస్తావించాలని, తెలంగాణ తల్లి విగ్రహం నాడు ఉద్యమ సమయంలో రగిల్చిన స్ఫూర్తి గురించి వివరించాలని కేసీఆర్ సూచించారు.

# జోధ్‌పూర్‌తో సర్దార్ పటేల్‌కు లోతైన అనుబంధం ఉంది

ఆయన లేకుంటే ఈరోజు జోధ్‌పూర్ పాకిస్థాన్‌లో భాగమై ఉండేదేమో:

కేంద్ర హోంమంత్రి అమిత్ షా



జోధ్‌పూర్, డిసెంబర్ 8 సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఆదివారం జోధ్‌పూర్‌లో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాజస్థాన్ ఉపముఖ్యమంత్రి ప్రేమ్‌చంద్ బైర్వత్, మంత్రి జోగారామ్ పటేల్, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ఎమ్మెల్యేలు సర్క్యూట్ హౌస్ వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వేడుకను ఉద్దేశించి మాట్లాడుతూ, జోధ్‌పూర్‌తో సర్దార్ పటేల్‌కు లోతైన అనుబంధం ఉందని అన్నారు. ఆయన లేకుంటే ఈరోజు జోధ్‌పూర్ పాకిస్థాన్‌లో భాగమై ఉండేదేమో.

సర్దార్ పటేల్‌కు కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవం ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. అదే సమయంలో, సర్దార్ పటేల్ లేకుంటే, దేశంలోని సంస్థానాల విలీనం కలలో ఉండేదన్నది కూడా నిజం. గుజరాత్‌తో సహా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వంటి సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసింది ఆయనే. దీనితో పాటు, అతను వ్యూహాత్మకంగా జోధ్‌పూర్ యొక్క వాయుమార్గాలను అభివృద్ధి చేశాడు మరియు విలీనం కోసం ఇక్కడి మహారాజును అనుసరించాడు. "సర్దార్ పటేల్‌కు ఎవరూ న్యాయం చేయలేదన్నది వాస్తవం. బీజేపీ పాలనకు ముందు ఆయనకు గౌరవం ఇవ్వలేదు. కాంగ్రెస్‌లో ఒకే కుటుంబానికి గౌరవం లభించింది. భారత్ ముక్కలు ముక్కలవుతుందన్న చర్చిల్ జోస్యాన్ని సర్దార్ పటేల్ నిరూపించారు. స్వాతంత్ర్య సమయం తప్పు' అని అన్నారు.

పటేల్ సోమనాథ్ ఆలయాన్ని నిర్మించారని, దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, దేవాలయాలను పునరుద్ధరిస్తామని చెప్పారు. అయితే కాంగ్రెస్ మనస్తత్వం కారణంగా 75 ఏళ్లుగా అయోధ్యలో ఆలయాన్ని నిర్మించలేకపోయారు. సర్దార్ పటేల్ ఆర్టికల్ 370కి వ్యతిరేకం మరియు యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలనుకున్నారు. ఆయన అసంపూర్తి పనులను గత 10 ఏళ్లలో మోడీ ప్రభుత్వం పూర్తి చేసింది.సర్దార్ వల్లభాయ్ పటేల్ జీ తన అద్వితీయ నాయకత్వ సామర్థ్యంతో దేశాన్ని ఏకం చేశారు. జోధ్‌పూర్ సర్క్యూట్ హౌస్‌లో ఆవిష్కరిస్తున్నాను" అని ఆయన తన ఎక్స్ హ్యాండిల్ నుండి పోస్ట్ చేశారు."నేడు, ఆర్టికల్ 370 ఉనికిలో లేదు. కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా మారింది మరియు ఉత్తరాఖండ్‌లో యు సి సి అమలు చేయబడింది. నేడు, ప్రపంచంలోనే అతిపెద్ద స్మారక చిహ్నం అతని పేరు మీద ఉంది" అని అన్నారు.

జోధ్‌పూర్ వంటి రాచరిక రాజ్యం అయిన మార్వార్ కూడా స్వాతంత్ర్యానికి నాలుగు రోజుల ముందు, అంటే ఆగస్టు 11, 1947న భారతదేశంతో విలీన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఆలస్యానికి ఒక కారణం ఏమిటంటే, ఆ సమయంలో దేశంలో అనేక తిరుగుబాట్లు జరిగాయి. నేడు ఆ సంఘటనలన్నీ చరిత్ర పుటల్లో నిలిచిపోయాయి. అప్పుడు మహారాజా హన్వంత్ సింగ్ పాకిస్తాన్‌లో చేరాలని కోరుకున్నాడు, ఇది మార్వార్ ప్రజలతో పాటు రాజకీయ నాయకులను ఆందోళనకు గురిచేసింది. ఈ మొత్తం కథ చాలానే చెబుతుందని చెప్పారు.

జోధ్‌పూర్‌లోని జై నారాయణ్ వ్యాస్ యూనివర్శిటీ చరిత్ర విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ జహూర్ మహ్మద్ ప్రకారం, మహారాజ్ హన్వంత్ సింగ్ తెలివైన రాజకీయ నాయకుడు కాబట్టి ప్రత్యేక హోదాను కోరుకున్నారు. దీనికి కారణం 10 లక్షల జనాభా ఉన్న సంస్థానాన్ని ప్రత్యేక యూనిట్‌గా మార్చవచ్చని, అంటే ఒక యూనిట్‌గా జీవించవచ్చని భారత ప్రభుత్వం అప్పట్లోనే చెప్పింది. దీని ప్రయోజనాన్ని పొందడానికి, సింగ్ పాకిస్తాన్‌లో చేరడానికి డాంబిక ప్రయత్నం చేసాడు, అయితే అతని తండ్రి మరియు తాను ఇప్పటికే వారు భారతదేశంలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు. పాకిస్థాన్‌లో చేరిన విషయం ఆనాటి ప్రజలు రాసిన పుస్తకాల్లో మాత్రమే నమోదు చేయబడింది, రాజకుటుంబంలో లేదా మరెక్కడా కాదు.మేవార్ పాకిస్తాన్‌లో చేరడం గురించి వివరంగా ప్రస్తావించడం జర్నలిస్టులు లారీ కాలిన్స్ మరియు లాపియర్ రాసిన 'ఫ్రీడం ఎట్ మిడ్‌నైట్' పుస్తకం యొక్క హిందీ అనువాదంలో 171 మరియు 172 పేజీలలో చూడవచ్చు. మహారాజా ఉమేద్ సింగ్ తర్వాత జోధ్‌పూర్ ఆదేశం హన్వంత్ సింగ్‌కు చేరిందని అందులో పేర్కొన్నారు. ఆ సమయంలో, రెండు రాచరిక రాష్ట్రాలు ьబికనీర్ మరియు జైసల్మేర్ ι భోపాల్ నవాబుతో టచ్‌లో ఉన్నాయి. నవాబ్ సలహాదారు, సర్ జఫరుల్లా ఖాన్, హన్వంత్ సింగ్‌ను కలుసుకుని, "నువ్వు పాకిస్థాన్‌లో చేరితే, (మహమ్మద్ అలీ) జిన్నా నీ షరతులన్నీ అంగీకరించడానికి ఖాళీ కాగితంపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు" అని చెప్పి పాకిస్తాన్‌లో చేరమని సలహా ఇచ్చాడు.

అతను ఢిల్లీలో జిన్నాను కూడా కలిశాడు, అయితే అదే రోజు, పటేల్ యొక్క విశ్వసనీయుడు మీనన్ కూడా ఇంపీరియల్ హోటల్‌లో హన్వంత్ సింగ్‌ను కలిశాడు. సింగ్‌ని కలవడానికి మీనన్ వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్‌ను సిద్ధం చేశారు. మౌంట్ బాటన్ మహారాజుతో మాట్లాడి తన తండ్రికి సర్దార్ పటేల్ కు మధ్య ఉన్న సంబంధాల గురించి చెప్పాడు. దీనిపై, మహారాజ్ భారతదేశంలో చేరడానికి అంగీకరించారు. మీనన్ మరియు హన్వంత్ సింగ్‌లను గదిలో ఉంచి మౌంట్ బాటన్ గది నుండి వెళ్లిపోయాడు. వాయిద్యంపై సంతకం చేయడానికి మహారాజు పెన్ను టోపీని తెరిచిన వెంటనే, అది తుపాకీగా మారింది, అది అతను మీనన్ వైపు చూపాడు. ఈ సమయంలో మౌంట్‌బాటన్ తిరిగి వచ్చి అతని నుండి తుపాకీని తీసుకున్నాడు, దానిని అతను మ్యూజియంకు విరాళంగా ఇచ్చాడు

# శాంతికి బుద్ధుడి బోధనలే శరణ్యం

భౌద్ధ మతస్థులు ప్రతి ఏట నిర్వహించుకునే ప్రధాన ఉత్సవాల్లో "బోధి దినోత్సవం" కూడా ఒకటిగా పరిగణించబడుతున్నది. 08 డిసెంబర్ పుణ్య గడియల్లో గౌతమ బుద్ధుడు లేదా యువరాజు సిద్ధార్థ్ గౌతముడు జ్ఞానోదయం అయిన శుభ వేళలుగా బోధి దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. సిద్ధార్థుడు జ్ఞానోదయం పొంది గౌతమ బుద్ధుడిగా మారిన రోజుగా ఈ దినోత్సవానికి గుర్తింపు ఉంది. యువ రాజు సిద్ధార్థుడు ప్రజల నిజ జీవితాల్లో ఎదురవుతున్న కష్టాలు, దుఃఖాలు, పీడలు, అనారోగ్యాలు, బాధలు, కడు పేదరికం, మరణాలను చూసి చలించి జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడానికి రాజ్య కాంక్షను వదిలి భారత్‌లోని బుద్ధ గయా ప్రాంతంలో బోధి వృక్షం నీడన తపస్సు చేయడం, జ్ఞానోదయం పొందడం జరిగింది. మానవ జీవితంలోని బాధలకు సమాధానంగా 'నిర్వాణ' స్థితికి చేరటం, బుద్ధుడి "ఆదర్శ ఎనిమిది జీవన మార్గాల(నోబుల్ యైత్‌ఫోల్డ్ పాథ్)ను సూచించడంతో ప్రజలు బాధలకు దూరంగా మానసిక ప్రశాంతతతోఎదుగుతూ సంతోషమయ జీవితాలను గడపాలని బోధించారు. బోధి దినం ప్రారంభం 2,500 ఏండ్ల క్రితం ప్రారంభమైందని చరిత్ర పేర్కొంటున్నది. బోధి దినోత్సవం రోజున ఆత్మ విమర్శ చేసుకోవడం, ధ్యానం చేయడం, నూతన తీర్మాణాలను చేసుకోవడం, బుద్ధుడి బోధనలను మననం చేసుకోవడం, వాటిని తూచా తప్పకుండా పాటించడానికి సంకల్పం తీసుకోవడం లాంటి సత్కార్యాలు చేపడతారు. వివేకం, కరుణ, భౌతిక సుఖాల పట్ల నిరాసక్తత లాంటివి మనిషి సుఖ జీవనానికి సోపానాలుగా ఉపకరిస్తాయని నమ్ముతారు. ఆధ్యాత్మిక ఆచారాలను పాటించిన మానవ జీవితాల్లో సానుకూల శక్తి ఉద్భవించి జ్ఞానోదయ స్థితికి చేరుతారని, మరో దుఃఖమయ జీవితం లేకుండా మోక్షం సిద్ధిస్తుందని బుద్ధుడు బోధించాడు. గౌతమ బుద్ధుడి బోధనల్లో ఎనిమిది జీవన మార్గాలు సూచించడం జరిగింది. సన్మార్గ దర్శనం/ఆలోచనలు(రైట్ వ్యూవ్), సరైన తీర్మాణాలు తీసుకోవడం(రైట్ రెజొల్యూషన్స్), సుభాషణ గుణం(రైట్ స్పీచ్), సత్కార్యాలను చేయడం(రైట్ ఆక్షన్), సక్రమ మార్గంలో జీవనోపాధులు పొందడం(రైట్ లైవ్‌లీవుడ్), సరైన కృషి చేయడం(రైట్ ఎఫర్ట్), మానసిక ఆలోచనలు చక్కగా ఉండడం(రైట్ మైండ్‌ఫుల్‌నెస్), చక్కటి ఏకాగ్రతను పొందడం(రైట్ కాన్‌సెంట్రేషన్) అనే ఎనిమిది జీవన సూత్రాలను గౌతమ బుద్ధుడు బోధించడం జరిగింది.అందరు ఆనందంగా, ఆరోగ్యంగా, పవిత్ర భావనలతో బాధలకు దూరంగా జీవించాలని బుద్ధుడు ఆకాంక్షించాడు. మనిషి కర్మకు కారణం మనస్సు మాత్రమే. మనం ఏ విధంగా ఆలోచిస్తే, ఆచరణలో పెడితే, అదే తప్పక జరుగుతుంది. ఆనందానికి మార్గం లేదు. ఆనందంగా ఉండడమే ఓ ఉత్తమ మార్గం అని గౌతముడు బోధించాడు. పంచడంతో ఆనందం తరిగి పోదని గుర్తుంచుకోవాలి. ఒక కొవ్వత్తి వేల కొవ్వత్తులను వెలిగించినట్లు ఒక మహొన్నతుడు వేల మందికి జీవనానంద రహస్యాలను బోధించగలడు.

# సాహిత్య ఉద్యమంలో చలసాని స్థానం

చలసాని ప్రసాద్ ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు. ఆయన విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులు. విప్లవ రచయితగా, ప్రజా ఉద్యమాలను సమర్థించే కార్యకర్తగానే ఆయన జీవిత మంతా గడిపారు. ఉద్య మాల అణచివేతపై గళమెత్తారు. ఈ క్రమంలో అనేక సార్లు జైలుకు వెళ్లారు. విరసం ప్రస్థానంలో చలసానిది చెరగని ముద్ర. చలసాని ప్రసాద్ స్వస్థలం కృష్ణా జిల్లా లోని భట్ల పెనుమర్రు. డిసెంబరు 8, 1932 న కృష్ణానదీ తీరంలోని చల్లపల్లి దగ్గరిలో నాదెళ్ళవారి పాలెంలో జన్మించారు. విరసం స్థాపనలో ఆయనది కీలకమైన పాత్ర. అత్యవసర పరిస్థితి కాలంలో ఆయన జైలుకు వెళ్లారు. నమ్మిన విప్లవ సిద్ధాంతానికి కట్టుబడిన ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభ వించారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా ఆయనకు మంచి పేరుంది., కొడవటి గంటి కుటుంబ రావు, రావిశాస్త్రి, కెవిఆర్‌లతో ఆయనకు సన్నిహిత సంబంధా లుండేవి. పలు గ్రంథాలను ఆయన సంకలనం చేశారు. శ్రీశ్రీ సాహిత్యంపై ఆయనకు ఎనలేని పట్టు ఉండేది. సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాల్లో ఆయన ముఖ్యమైన భూమిక పోషించారు చలసాని ప్రసాద్. విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన చివరి శ్వాస వరకు పాల్గొంటూ వచ్చారు. కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగానే కొనసాగారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన చలసాని ప్రసాద్.. నమ్మిన సిద్ధాంతాలకోసం చాలా మందితో విభేదించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఎమర్జన్సీ కాలంలో చలసాని ప్రసాద్ జైలు శిక్ష అనుభవించారు. సాహితీ విమర్శకుడుగా ఎందరికో స్ఫూర్తి నిచ్చారు. విప్లవ రచయితల సంఘం స్థాపనలో శ్రీశ్రీతో కలిసి పనిచేశారు. ప్రజా ఉద్యమాల అణిచివేతలపై జీవితకాలం పోరాడారు. ఎన్నోసార్లు జైలు జీవితం గడిపాడు. శ్రీశ్రీ, రంగనాయకమ్మలకు చలసాని అత్యంత సన్నిహితులు. ఆయన విశాఖపట్నం ఎ.వి.ఎన్ కళాశాల నుంచి రాజనీతి శాస్త్రం అధ్యాపకునిగా పదవీ విరమణ చేశారు. హెచ్.బి.కాలనీ, విశాఖ పట్నంలోని ఆయన గృహంలో అనేక 20 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. అందులో ఎక్కడా లభించని అరుదైన పుస్తకాలు ఉన్నాయి. ఆయన అనేక విషయాలలో లోతుల వరకు చర్చించేవారు. ఆయన వద్ద ఉన్న పుస్తకాల ఆధారంగా ఎందరో పీహెచ్‌డీలు చేశారు. ఆయన వామపక్ష భావజాలం కలిగి ఉన్నప్పటికీ విశ్వనాథ సత్య నారాయణ సాహిత్య సమా వేశాలకు ఎప్పుడూ హాజరయ్యే వారు. ఆయనకు రచలనంటే ఆసక్తి ఎక్కువ. పధ్నాలుగేళ్లు కష్టపడి ఇరవై భాగాలుగా శ్రీశ్రీ సాహితీ సర్వస్వాన్ని ప్రచురించినా, అదే తరగని ఉత్సాహంతో రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుల సాహిత్య మంతటినీ సంపుటాలుగా వెలువరించినా అది చలసానికే చెల్లింది. కృష్ణా జిల్లాలోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన చలసాని ప్రసాద్ బాల్యం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని చూస్తూ, ఆస్వాదిస్తూ పెరిగారు.


తెలంగాణా సాయుధ పోరాటంలో ఆయన కుటుంబం ప్రత్యక్షంగా పాలుపంచుకుంది. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి మార్క్సిస్టుగా పెరిగి, విప్లవ రచయితగా స్థిరపడ్డ చలసాని జీవితం ఎన్నో ప్రత్యేకతల సమాహారం. సాహిత్య రంగంలో ఆయన కృషి ఎన్నదగినది. సాహిత్యోద్యమాల నిర్మాణంలో గత అర్ధ శతాబ్దంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విరసం వ్యవస్థాపకత్వంలో ఆయనది ప్రధానమైన పాత్ర. ఆయన పేరు ఎవరు ప్రస్తావించినా విరసం ప్రసాద్ అంటారు. విరసం దాదాపుగా ఆయన ఇంటిపేరై పోయింది. ప్రసాద్ సాహితీ సృజన తక్కువేమీ కాదు. కవిత్వం, వ్యాసాలు రాశారు. అవసరమై నప్పుడల్లా సామాజిక, రాజకీయ అంశాల మీదా రాశారు. అయితే ఉద్యమ జీవులందరికి లాగే తన సృజనాత్మక శక్తిని ప్రోది చేసుకుని, పదిల పరచుకుని ఆ రంగంలో కీర్తి సంపాదించాలన్న దుగ్ధ ఆయనకే నాడూ లేదు. 1970లో విరసం ఏర్పడినప్పటి నుంచి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. 1985 నుంచి 88 వరకు మూడేళ్ల పాటు విరసానికి కార్యదర్శి. 1998 నుంచి 2002 వరకు అధ్యక్షులు. అయినా ఆయన సాహిత్యోద్యమంలో తనను తాను కార్యకర్తగానే పరిగణించే వారు. సాహితీ రంగం కూడా ఆయనను అదే దృష్టితో చూసింది. తొమ్మిదో తరతి విద్యార్థిగా ఉన్నప్పుడు 1947 "నవయుగ" సంచికలో "ఓ విద్యార్థి సోదరుడా, సమ్మెయే మన ఆఖరి ఆయుధమోయ్" అన్న పాటతో మొదలు పెట్టి కవిత్వం, సాహిత్య విమర్శ, ముందు మాటలు, సాహిత్య, రాజకీయ అంశాల మీద వ్యాసాలు దండిగానే రాశారు. చాలా కాలం పాటు ఒకటి రెండు అనువాదాలు తప్ప స్వతంత్ర రచనలుగా ప్రచురించడం మీద ఆయన దృష్టి ఎన్నడూ లేదు.

2008లో "సాహిత్య వ్యాసాలు", 2010లో "చలసాని ప్రసాద్ రచనలు" వెలువడ్డాయి. ఇంగ్లీషును ఎదిరించి నిలిచిన భాష తెలుగు. ఏ భాషా పదాన్నయినా తనలో కలుపుకొని ఎదిగే శక్తి తెలుగుకు ఉంది. అందుకే తెలుగు అజరామరం. తెలుగు భవిష్యత్తు ఉజ్వలం అని చలసాని చెపుతుండే వారు. చలసాని జూలై 25, 2015న విశాఖపట్టణం లోని తన నివాసం లోనే గుండెపోటుతో తుది శ్వాస విడిచారు

# విప్లవ వీరుడు నారాయణ పవార్

ఆయన ఒక పోరాట యోధుడు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు. ప్రాణాలను పణంగా పెట్టీ, ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ త్యాగ ధనుడు. రాచరికంలో బందీ అయిన తెలంగాణ ప్రజల స్వేచ్ఛాకాంక్షను ప్రపంచానికి చాటడానికి, నిజాం ప్రభువు హత్యకై ఆయనపై బాంబును విసిరిన సాహస వంతుడు. ఆయనే పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ నారాయణ పవార్. బాంబు గురి తప్పినా, ఆయన బందీ అయినా, ఆయన త్యాగ నిరతి, స్ఫూర్తి దాయకం అయింది. పవార్ బాంబు వేసిన సంఘటనను పార్లమెంట్‌లో భగత్‌సింగ్ చేసిన సాహసంతో నాటి ప్రజలు పోల్చుకునే వారు. అయితే ఆ సాహస వీరునికి ప్రాధాన్యత దక్కలేదు. తానే స్వయంగా నిరాహార దీక్ష చేస్తే గానీ రాజకీయ ఖైదిగా గుర్తించలేదు. నాటి తరానికి పవార్ ఆదర్శవంతుడే అయినా, చరిత్ర ఆయన కు తగిన ప్రాధాన్యత ఇవ్వని కారణంగా, నాటి తరానికీ స్ఫూర్తి ప్రదాత అయిన పవార్ పేరు కూడా నేటి తరానికీ తెలియని దుస్థితి శోచనీయం. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో మగ్గక తప్పలేదు. సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాంకు అండగా ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపై బడి దోపిడి చేయడం, ఇండ్లు తగల బెట్టడం నానా అరాచకాలు సృష్టించగా, హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. 1926 అక్టోబర్ 3న వరంగల్‌లో జన్మించిన నారాయణరావు పవార్. బాల్యం నుంచే స్వేచ్ఛ భావాలు కలిగి అణచివేత ఏ రూపంలో ఉన్నా సహించేవాడు కాదు. 8వ తరగతిలోనే ఆర్య సమాజ్‌లో చేరాడు. నిజాం నవాబ్ ఆకృత్యాలు చదివాడు. ప్రత్యక్షంగా చూసాడు. అప్పుడే నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించు కున్నాడు. కొంత మంది యువకులతో కలిసి "ఆర్య యువక్రాంతి దళ్" ఏర్పాటు చేశాడు. దీనికి కొండా లక్ష్మణ్ బాపూజీ సలహాదారుడుగా ఆర్థిక సహాయం చేశాడు. సమకాలీన రాజకీయాలపై నిరంతరం చర్చించేవారు. " మారు వేశాలలతో వెళ్ళి హైదరాబాద్లో. జిన్నా 'రెచ్చగొట్టే ఉపన్యాసం విన్నాడు. తెలంగాణ సాయుధ పోరుకు సంఘీభావంగా ఏదైనా చేయాలను కున్నారు. ప్రతి దినం సాయంత్రం నిజాం నవాబ్ దారుల్ షిఫాల ఉండే తన తల్లి సమాధిని దర్శించుకు నేందుకు వెళతాడని తెలుసుకుని మిత్రులతో కలిసి నైజాంను చంపాలని, ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డారు. నారాయణ పవార్, పండిత విశ్వనాథ్ బొంబాయి వెళ్లి బాంబులు కొనాలని బయలు దేరారు. మార్గ మధ్యలో షోలాపూర్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ కనబడ్డాడు. విషయం చెప్పారు. ఆరు వందల రూపాయ లిచ్చి జాగ్రత్తలు చెప్పి వెళ్లాడు. బొంబాయి వెళ్లి రెండు బాంబులు, రెండు రివాల్వర్లను తీసుకున్నారు. బాంబులు ఫెయిల్ అయితే రివాల్వర్, అదీ ఫెయిల్ అయితే శత్రువుకు మాత్రం చిక్కకూడదు, పథకం ఎక్కడ పొక్క కూడదు. ఇది పథకం. హైదరాబాద్‌కు వచ్చిన పవార్ నిజాంను ఎందుకు చంపాలనుకున్నది వివరంగా ఒక ఉత్తరం రాసారు. పవార్, జగదీష్, గండయ్యలు దానిపై రక్తంతో సంతకం చేసి నారాయణ స్వామికి ఇచ్చారు. బాంబులు వేసిన తర్వాత విజయవాడకు వెళ్లి ఆ పత్రాన్ని పత్రికలకు, రేడియో సంబంధీకులకు, నారాయణ స్వామి ఇవ్వాలన్నది వారి పథకం. అనుకున్న విధంగా వారు సంసిద్ధ మైన క్రమంలో, 1947 డిసెంబర్ 4న సాయంత్రం సుమారు 4 గంటల సమయాన, కింగ్‌కోఠి రోడ్డు నుండి తల్లి సమాధి దగ్గరకు వెళ్లే సమయంలో నిజాం ఇంటి ముందే గండయ్య, జగదీష్‌తో కలిసి పవార్ మాటు వేశాడు. పవార్ అందరికంటే ముందు ఉన్నాడు. ఒకవేళ అతని చేతిలో తప్పించుకుంటే రెండోవాడు, అక్కడా తప్పితే మూడో వ్యక్తి పూర్తి చేయాలని రెడీ అయ్యారు. నిజాం కారు పవార్ దగ్గరకు రాంగనే కారుపై బాంబు విసిరాడు. అది గురి తప్పింది. కానీ ఆ బాంబు పేలుడుకు ఒక ఆడ మనిషి చనిపోయింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నిజాంపై రివాల్వర్‌తో కాల్చాలను కున్నాడు. ఈలోపే పోలీసులు పట్టుకున్నారు. బాంబు శబ్దం విన్న జగదీష్, గండయ్య పథకం విజయవంతమైందని అనుకొని వెళ్లిపోయారు. లేకుంటే నిజాంకు అదే ఆఖరి రోజు అయ్యేది. సైకిల్ ఆధారంగా గండయ్యను కూడా అరెస్టు చేశారు. ఐదు రోజులు నారాయణ పవార్‌ను పోలీసులు నానా చిత్ర హింసలు పెట్టారు. తన కేసును వాదించడానికి కోవడానికి వకీల్‌ను నియమించు కోక, స్వయంగా తానే తన వాదనలను వినిపించు కున్నాడు. ఎందుకు చంపాలను కు న్నాడో విచారణలో వివరించాడు. చివరికి కోర్టు పవార్‌కు ఉరిశిక్ష విధించింది. 1948 సెప్టెంబర్ 18న అది అమలు కావాల్సి ఉండగా, ఒక్క రోజు ముందు సెప్టెంబరు 17 న నిజాము నవాబు వల్లబాయి పటేల్ ముందు లొంగిపోగా, హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారత్ లో విలీనం అయి పోయింది. సంస్థానం విముక్తి తర్వాత మిలిటరీ గవర్నర్ మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి, ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చాడు. కాని వివిధ సంస్థల ఆందోళనతో 1949 ఆగస్టు 10న జనరల్ చౌదరి వీరిని విడుదల చేశాడు.అతనితోపాటు గండయ్య కూడా విడుదలయ్యాడు. ఎట్టకేలకు పవార్ 2009 ఆగస్టు 9న నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ద్వారా పవార్ సన్మానించ బడి నాడు. నారాయణరావు పవార్ 85 యేళ్ళ వయసులో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో, 2010, డిసెంబర్ 8 న కన్నుమూసాడు. తెలంగాణ గర్వించ దగిన పవార్ లాంటి ధీరులను, త్యాగ ధనులను భావితరాలకు తెలిసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాటి చరిత్ర ను మరవకుండా ఉండేందుకు వైయక్తిక, చారిత్రక సంఘటనలను, సందర్భాలను పాఠ్యాంశాలుగా చేయాలి.

## అమెరికాలో భారీ భూకంపం



కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. అమెరికా కాలమానం ప్రకారం.. గురువారం ఉదయం 10.44 గంటలకు ఈ ప్రకృతి విపత్తు చోటు చేసుకున్నది. భూకంప తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై ఏడుగా నమోదైంది. ఫెర్నడెల్ పట్టణంలో భూకంప కేంద్రం నమోదయినట్టు అమెరికా జియోగ్రఫికల్ సర్వే విభాగం వెల్లడించింది. భారీ భూకంపం రావడంతో అమెరికా సునామీ కేంద్రం ముందస్తు చర్యగా సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత కాసేపటికే అధికారులు దానిని ఉపసంహరించుకున్నారు. భూకంప ప్రభావంతో పెట్రోలియా, స్కాటియా, కాబ్ తదితర ప్రాంతాల్లో శక్తిమంతమైన ప్రకంపనలు నమోదయ్యాయి. అయితే, దీని ప్రభావంతో ఏర్పడిన ప్రాణ, ఆస్తి నష్టాల సమాచారం తెలియాల్సి ఉంది. ఉత్తర దిశలో వచ్చిన భూ ప్రకంపనలు దక్షిణ ప్రాంతంలోని శాన్‌ఫ్రాన్సిస్కో వరకు వచ్చాయంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. భూకంపంతో భవనాల్లోని ప్రజలు ఆందోళనతో భయభ్రాంతులకు లోనయ్యారు. భూకంపం ఆగిన తర్వాత కూడా ప్రకంపనలు వచ్చాయి.

## ఫెంగల్ తుపాను సాయంగా తమిళనాడుకు రూ.944 కోట్లు

న్యూఢిల్లీ: ఫెంగల్ తుపాను కారణంగా దెబ్బ తిన్న తమిళనాడుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి రూ.944 కోట్లు విడుదలజేయడానికి కేంద్ర హెూం మంత్రిత్వశాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. దీనిని రెండు విడతలుగా అందజేయనున్నట్లు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. కేంద్ర బృందం నుండి మదింపు నివేదికలను స్వీకరించిన తర్వాత జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుండి అదనపు నిధులు ఇచ్చే విషయం పరిశీలిస్తామని హెూం శాఖ హామీ ఇచ్చింది. కేరళలో వయనాడ్ బాధితులకు కేంద్రం ఇప్పటికీ ఒక్క పైసా కూడా సాయం అందజేయకపోవడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఫెంగల్ నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, తమిళనాడుకు యుద్ధ ప్రాతిపదికన సహాయం ప్రకటించాలని కేంద్రాన్ని ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. ఇటీవల ఫెంగల్ తుపాను కారణంగా తమిళనాడు నాడులో జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ఆ రాష్ట్రానికి యుద్ధ ప్రాతిపదికన సహాయం ప్రకటించాలని కేంద్రాన్ని ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఫెంగల్ కారణంగా తమిళనాడులో ఇప్పటి వరకూ 24 మంది మరణించారని, ఎనిమిది జిల్లాల్లో 3 లక్షలకు పైగా ఎకరాల్లో వరి పంట దెబ్బతిందన్నారు. మొత్తంగా ఆరు లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు, విద్యుత్ సరఫరాకు తీవ్రనష్టం వాటిల్లిందని పేర్కొంది. సుమారు కోటిన్నర మంది తుపాను బారినపడ్డారని, అనేక మంది జీవనోపాధి దెబ్బతిందని తెలిపింది. కేంద్రం తక్షణమే సాయం అందించాలని కోరింది. తుపాను బాధిత గ్రామాల్లో ప్రజలకు ఎఐకెఎస్ వలంటీర్లు సహాయం చేస్తున్నారని తెలిపింది. సహాయక చర్యలకు నేతృత్వం వహిస్తున్న ఎఐకెఎస్ తమిళనాడు రాష్ట్ర కమిటీకి ఉదారంగా విరాళాలందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## సిరియా అధ్యక్షుడు అసద్ విమానం కూల్చివేత!

దేశం విడిచి పారిపోతుండగా విమానం కూలిపోయిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం

అసద్ విమానం ఒక్కసారిగా కిందకి పడిపోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్ సైట్ల ద్వారా వెల్లడి

లెబనాన్ పరిధిలో విమానం నేలకూలినట్లు ఈజిప్ట్ రచయిత ట్వీట్

సిరియా రాజధాని డమాస్కస్ లోకి తిరుగుబాటుదారులు ప్రవేశించడంతో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచిపెట్టారని అక్కడి అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, అధ్యక్షుడు ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేశారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. లెబనాన్ గగనతలంలో ఈ ఘటన జరిగిందని పలువురు పోస్టులు పెడుతున్నారు. దీనికి సంబంధించి ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్ సైట్లలోని వివరాలను తమ పోస్టులకు జతచేస్తున్నారు. ఈజిప్ట్ కు చెందిన రచయిత ఖలీద్ మహమూద్ చేసిన ట్వీట్ ప్రకారం.. సిరియా అధ్యక్షుడు అసద్ ప్రయాణిస్తున్న ఐఎల్-76 విమానం డమాస్కస్ నుంచి బయలుదేరి లెబనాన్ మీదుగా వెళుతుండగా విమానం ఎత్తు సడెన్ గా పడిపోయింది.

లెబనాన్ గగనతలంలో 3,650 మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం అకస్మాత్తుగా 1,070 మీటర్ల ఎత్తుకు పడిపోయిందని మహమూద్ చెప్పారు. ఆ తర్వాత విమానం ఆచూకీ రాడార్ కు అందలేదని వివరించారు. విమానం ఎకాఎకిన అంత కిందకు దిగడం, ఆ తర్వాత రాడార్ మీద కనిపించకుండా పోవడంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఐఎల్ -76 ను ఎవరైనా కూల్చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. అసద్ విమానం కూలిందని చెబుతున్న ఏరియా లెబనాన్ పరిధిలో ఉంది. అయితే, ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి సమాచారం అందుబాటులో లేదు.

# విమానాలకు బెదిరింపుల కేసులు ఎన్ఐఏకి బదిలీ




న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి నడుస్తున్న వివిధ విమానయాన సంస్థల విమానాలకు బెదిరింపులకు సంబంధించి నమోదైన కనీసం 16 కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కి బదిలీ చేసే అవకాశం ఉందని అధికారులు శుక్రవారం తెలిపారు. కేసులను ఎన్ఐఏకు బదిలీ చేయాలని ఢిల్లీ పోలీసులు నగర ప్రభుత్వ హెూం శాఖకు లేఖ రాశారని, తుది ఆమోదం కోసం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు పంపుతామని వారు తెలిపారు. "ఈ విషయం జాతీయ భద్రతకు సంబంధించినది. ఇది అంతర్జాతీయంగా ప్రభావం చూపుతుంది. ఈ 16 కేసులన్నీ బిఎన్ఎస్ సెక్షన్లతో కూడిన పౌర విమానయాన భద్రత (ఎస్‌యుఎ ఎస్‌సిఎ) చట్టంపై చట్టవిరుద్ధమైన చట్టాలను అణచివేయడం కింద నమోదు చేయబడ్డాయి. వాటిపై లోతైన దర్యాప్తు అవసరం "అని అధికారిక వర్గాలు తెలిపాయి.అక్టోబరు చివరి రెండు వారాల్లో, 510 కంటే ఎక్కువ దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అవి తర్వాత బూటకమని తేలింది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎయిర్‌లైన్స్‌కు పెద్ద కార్యాచరణ, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. సోషల్ మీడియా ద్వారా చాలా వరకు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ నుంచి నడిచే 150కి పైగా దేశీయ లేదా అంతర్జాతీయ విమానాలకు బెదిరింపులు రావడంతో 16 కేసులు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అక్టోబరు 16న బెంగుళూరు వెళ్లే అకాసా ఎయిర్ విమానాన్ని లక్ష్యంగా చేసుకుని ఎక్స్ ద్వారా బాంబు బెదిరింపు రావడంతో మొదటి కేసు నమోదైంది. 180 మందికి పైగా ప్రయాణికులతో ఉన్న విమానం దేశ రాజధానికి తిరిగి రావాల్సి వచ్చిందని వారు తెలిపారు. ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు, ఢిల్లీ పోలీసుల సైబర్ సెల్‌తో కలిసి ఈ విషయంపై విచారణ జరిపారు, కాని ఇప్పటి వరకు వారికి ఏ కేసులోనూ లీడ్ లభించలేదు.

# 'మోడీ-అదాని భాయి భాయి'



న్యూఢిల్లీ: 'మోడీ-అదాని భాయి భాయి' అంటూ ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఎంపిల నినాదాలతో పార్లమెంట్ ఆవరణ దద్దరిల్లింది. అదాని ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో విచారణ జరిపించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు మార్చ్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఉభయ సభలు తిరిగి సమావేశం కావడానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీ ఎంపిలు 'మోడీ %-% అదాని భాయి భాయి' అని ఇంగ్లీష్‌లో రాసి ఉన్న బ్లాక్ మాస్కులు ధరించి నిరసన తెలిపారు. చేతిలో ఎరుపు రంగులోని రాజ్యాంగ ప్రతిని పట్టుకొని పార్లమెంట్ పాత భవనం నుంచి పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించారు. ధర్నాలో ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్, ఆర్‌జెడి, జెఎంఎం, డిఎంకె, ఎన్‌సిపి, ఆప్, ఐయుఎంఎల్, విసికె, కేరళ కాంగ్రెస్ తదితర పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మోడీ %-% అదాని ఏక్ హై, మోడీ-అదాని భాయి భాయి' అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ మార్చ్ ముగింపులో భాగంగా అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. అదాని వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అదానిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదాని వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు మోడీ సర్కార్ భయపడుతోందని ప్రియాంక గాంధీ అన్నారు. ఇలాంటి పరిస్థితి అసలు ఎందుకు వచ్చిందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం




న్యూఢిల్లీ : ఢిల్లీ ఓటర్ల జాబితా నుండి భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రజల ఓట్లను తొలగించి, ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకునే వారి ప్రాథమిక హక్కునిలాక్కోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని చెప్పారు. ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం, ఎన్నికల సంఘం ప్రజల హక్కునిలాక్కుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. షహదారా ప్రాంతం నుండి 11,018 మంది ఓటర్ల పేర్లను తొలగించాల్సిందిగా బిజెపి దరఖాస్తు చేసిందని, వాటిలో 500 పేర్లపై క్రాస్ చెక్ చేసినపుడు 75 శాతం మంది ఆ ప్రాంతంలోనే నివసిస్తునుట్లు తేలిందనిచెప్పారు. 2020 ఎన్నికల్లో షహదారా అసెంబ్లీ స్థానం నుండి ఆప్ నేత రామ్ నివాస్ గోయల్ బిజెపి నేత సంజరు గోయల్‌పై సుమారు 5,000 ఓట్ల తేడాతో విజయం సాధించారనికేజ్రీవాల్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గం నుండి 11,000 మంది ఓటర్లను తొలగించనున్నారని, వారిలో అధికశాతం మంది ఆప్ మద్దతుదారులేననితెలిపారు. ఒక నియోజకవర్గంలో ఆరు శాతం ఓట్లు తగ్గితే.. ఎన్నికలు నిర్వహించి ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. 2025లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగాను ఆప్ 62 స్థానాలను గెలుచుకోగా, బిజెపి ఎనిమిది స్థానాలకే పరిమితమైంది.

## గజ్వేల్ లో ఘోర ప్రమాదం.. ఇద్దరు కానిస్టేబుళ్లు దుర్మరణం

**ఈసీఐఎల్ లో జరుగుతున్న మారథాన్ కోసం వెళుతుండగా ప్రమాదం**

**జాలిగామ బైపాస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో స్పాట్ లోనే మృతి**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు**

గజ్వేల్ లో ఆదివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. జాలిగామ బైపాస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఓ బైక్ ను వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మరణించిన వారిని పరంధాములు, వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పరంధాములు రాయపోల్ పోలీస్ స్టేషన్ లో, వెంకటేశ్వర్లు దౌల్తాబాద్ పీఎస్ లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆదివారం ఈసీఐఎల్ లో జరుగుతున్న మారథాన్ లో పాల్గొనేందుకు వారిద్దరూ బైక్ పై బయలుదేరగా జాలిగామ బైపాస్ రోడ్డులో ప్రమాదం జరిగిందని వివరించారు. కాగా.. ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హరీశ్ రావు హామీ ఇచ్చారు.

# సోషల్ మీడియా ద్వారా ముస్లిం యువకులను రాడికలైజేషన్ చేయడం: రాడికలైజేషన్‌ను ఎదుర్కోవడంలో మతాధికారులు మరియు ముస్లిం సంస్థల పాత్ర

ఇంటర్నెట్ మన జీవితంలో అంతర్భాగంగా మారింది, కమ్యూనికేషన్, విద్య మరియు సామాజిక వొడంబడిక ద్వారా మార్గాలను అందిస్తోంది. ఏదేమైనా, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల పెరుగుదల తీవ్రవాద భావజాలాలకు హాని కలిగించే వ్యక్తులను, ముఖ్యంగా యువతలో ప్రచారం చేయడానికి, రిక్రూట్ చేయడానికి మరియు సమూలంగా మార్చడానికి ఒక స్థలాన్ని ఇచ్చింది. ఇటీవలి సంవత్సరాలలో, సామాజిక మాధ్యమాల ద్వారా ముస్లిం యువకుల తీవ్రవాదం ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆందోళనగా ఉద్భవించింది. ఇస్లామిక్ స్టేట్ (%ఖూఖూ%) మరియు అల్-ఖైదా (%సూశ్రీ-ఝువఝు%) వంటి తీవ్రవాద సంస్థలు ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించుకుంటున్నాయి మరియు వారి కథనాలను వ్యాప్తి చేయడానికి మరియు యువ ముస్లింలను నియమించుకోవడానికి ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌లను ఉపయోగించుకుంటున్నాయి, తరచుగా హింసను సమర్థించడానికి మతపరమైన ప్రసంగాలను ఉపయోగిస్తాయి. తీవ్రవాద భావజాలాలు వివిధ మూలాల నుండి ఉద్భవించవచ్చు, కానీ ముస్లిం యువకుల విషయంలో, జిహాద్ మరియు బలిదానం వంటి ఇస్లామిక్ భావనల దుర్వినియోగం తీవ్రవాద గ్రూపుల ద్వారా వారి రిక్రూట్‌మెంట్‌లో గణనీయమైన పాత్ర పోషిస్తాయి. ఈ భయంకరమైన ధోరణిని ఎదుర్కోవడానికి, ముస్లిం మతపెద్దలు, పండితులు మరియు సంస్థలు ఈ కథనాలను నిర్వీర్యం చేయడంలో మరియు యువ ముస్లింలకు ప్రామాణికమైన ఇస్లామిక్ బోధనలలో పాతుకుపోయిన ప్రత్యామ్నాయ ప్రసంగాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఈ సందర్భంలో, ముస్లిం మత గురువులు (ఉలేమా) మరియు ఇస్లామిక్ సంస్థల పాత్ర ప్రధానమైనది. వారు తీవ్రవాద భావజాలాలను ఎదుర్కోవడానికి మరియు యువతకు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాలను అందించడానికి అవసరమైన మతపరమైన అధికారం మరియు సమాజ ప్రభావాన్ని కలిగి ఉన్నారు. మత గురువులు మరియు ముస్లిం సంస్థలకు అత్యంత కీలకమైన పని ఏమిటంటే, తీవ్రవాద గ్రూపులు ప్రచారం చేసే ఇస్లామిక్ గ్రంథాల యొక్క వక్రీకరించిన వివరణలను సవాలు చేయడం. ఇది జిహాద్ వంటి భావనల గురించి మరింత సమగ్రమైన మరియు సందర్భోచిత అవగాహనను ప్రోత్సహించడాన్ని కలిగి ఉంటుంది, ఇది నిజమైన అర్థంలో హింసకు పిలుపు కాకుండా తనను తాను మరియు సమాజాన్ని మెరుగుపరచుకోవడానికి వ్యక్తిగత మరియు సామూహిక పోరాటాన్ని సూచిస్తుంది. మతాధికారులు కూడా ఇస్లాంలోని జీవి యొక్క పవిత్రతను నొక్కిచెప్పాలి, ఎందుకంటే అమాయకుడిని చంపడం మానవాళిని చంపినట్లే (ఖురాన్ 5:32) అని ఖురాన్ స్పష్టంగా పేర్కొంది. అనేక సందర్భాల్లో, మతపెద్దలు ముస్లింలు మరియు ఇతర విశ్వాసాల ప్రజల మధ్య శాంతియుత సహజీవనం, సంభాషణ మరియు సహకారం యొక్క చారిత్రక మరియు సమకాలీన ఉదాహరణలను హైలైట్ చేయడం ద్వారా ప్రతి-కథనాలను అందించవచ్చు. ఈ సందేశాలు యువతకు వారి అనుభవాలు మరియు ఆందోళనలతో ప్రతిధ్వనించే విధంగా చేరుకోవడం చాలా కీలకం. ఇక్కడే మీడియా ప్లాట్‌ఫారమ్‌లను సమర్థవంతంగా ఉపయోగించడం చాలా అవసరం. సామాజిక మాధ్యమాలు రాడికలైజేషన్‌కు యుద్ధభూమి అయినందున, ముస్లిం మతపెద్దలు మరియు సంస్థలు ఈ వేదికలపై యువతతో చురుకుగా పాల్గొనాలి. మతోన్మాద భావజాలాలను పైపైన కాకుండా లేదా విద్యాసంబంధమైన సెట్టింగులలో ఖండించడం సరిపోదుబీ మతాధికారులు మరియు పండితులు అతివాద గ్రూపులు వ్యాపింపజేసే అపోహలను నేరుగా పరిష్కరించే చిన్న వీడియోలు, బ్లాగులు లేదా ఇన్ఫోగ్రాఫిక్‌ల రూపంలో కంటెంట్‌ని సృష్టించాలి. రాడికలైజేషన్ జరుగుతున్న డిజిటల్ ప్రదేశాలలో ఈ స్వరాలు ఉండాలి.

ఇటువంటి కార్యక్రమాలకు ఇప్పటికే అనేక విజయవంతమైన ఉదాహరణలు ఉన్నాయి. ఉదాహరణకు, %ఖఖ%లోని ది క్విలియం ఫౌండేషన్ తీవ్రవాద వ్యతిరేక ప్రయత్నాలలో ముందంజలో ఉంది, రాడికలైజేషన్ ప్రోగ్రామ్‌లను అందించడం మరియు ఆన్‌లైన్‌లో ప్రత్యామ్నాయ సందేశాలతో యువతను ఆకర్షించడం దీని కర్తవ్యం. సౌదీ అరేబియాలో, సకినా(%ఝుఎఅఝుష్ట్ర%) క్యాంపెయిన్ ఇస్లాం యొక్క తీవ్రవాద వ్యాఖ్యానాలను సవాలు చేయడానికి సోషల్ మీడియాను ఉపయోగిస్తుంది, అయితే %ఖూజు% మరియు %ఖూ%లోని సావాబ్ (%వూఔూదీ%) సెంటర్ ట్విట్టర్‌లో %ఖూఖూ% ప్రచారాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తుంది. వివిధ ప్రాంతాల నిర్దిష్ట సాంస్కృతిక మరియు సామాజిక సందర్భాలను ప్రతిబింబించే స్థానికీకరించిన విధానాలతో ఈ ప్రయత్నాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలి. రేడికలైజేషన్ అనేది ఒక సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక కారకాలచే నడపబడుతుంది, ఇందులో అట్టడుగున ఉన్న భావన, అవకాశాల కొరత మరియు వివక్ష ఉంటుంది. మతాధికారులు మరియు ముస్లిం సంస్థలు యువకులకు సాధికారత కల్పించడం, విద్య మరియు ఉద్యోగ అవకాశాలను అందించడం మరియు వారికి చెందిన భావాన్ని పెంపొందించే కమ్యూనిటీ కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా ఈ మూల కారణాలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. స్థానిక మసీదులు, కమ్యూనిటీ కేంద్రాలు మరియు ఇస్లామిక్ స్వచ్ఛంద సంస్థలు ప్రమాదంలో ఉన్న యువతతో నిమగ్నమయ్యేలా ప్రోత్సహించబడాలి, మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లు, కౌన్సెలింగ్ మరియు వినోద కార్యకలాపాలను అందించాలి. అంతేకాకుండా, రియాక్టివ్‌గా కాకుండా చురుగ్గా ఉండే సమగ్ర డీరాడికలైజేషన్ వ్యూహాలను అభివృద్ధి చేయడానికి వారు ప్రభుత్వ సంస్థలు, పౌర సమాజం మరియు విద్యా సంస్థలతో సహకరించాలి. విభిన్న వర్గాల మధ్య అవగాహనను పెంపొందించే మరియు తీవ్రవాద సమూహాలు దోపిడీ చేసే సామాజిక-రాజకీయ మనోవేదనలను పరిష్కరించే ఇంటర్‌ఫెయిత్ డైలాగ్ కార్యక్రమాలు ఇందులో ఉండే విధంగా చూడాలి.

సోషల్ మీడియా ద్వారా ముస్లిం యువకులను సమూలంగా మార్చడం అనేది సంక్లిష్టమైన మరియు బహుముఖ సవాలు, దీనికి సూక్ష్మ స్పందన అవసరం. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో చట్ట అమలు మరియు గూఢచార సంస్థలు కీలక పాత్ర పోషిస్తుండగా, సమాజానికి-ముస్లిం మతాధికారులు మరియు సంస్థలకు మార్గనిర్దేశం చేసే మతపరమైన అధికారం మరియు నైతిక బాధ్యత కలిగిన వారు సైద్ధాంతిక పోరాటానికి నాయకత్వం వహించాలి. ఇస్లామిక్ బోధనల యొక్క ప్రామాణికమైన వివరణలను ప్రోత్సహించడం ద్వారా, సోషల్ మీడియా ద్వారా యువతతో సన్నిహితంగా ఉండటం మరియు రాడికలైజేషన్‌కు దోహదపడే అంతర్లీన సామాజిక-ఆర్థిక సమస్యలను పరిష్కరించడం ద్వారా, ముస్లిం నాయకులు తీవ్రవాద భావజాలాల నుండి హాని కలిగించే వ్యక్తులను దూరంగా ఉంచడంలో సహాయపడగలరు. హృదయాలు మరియు మనస్సుల కోసం ఈ యుద్ధం ఉగ్రవాద చర్యలను నిరోధించడం మాత్రమే కాకుండా ముస్లిం సమాజాల భవిష్యత్తును కాపాడడం మరియు యువ ముస్లింలు తరచుగా తప్పుగా అర్థం చేసుకునే ప్రపంచంలో అభివృద్ధి ఉండగలదని నిర్ధారించడం మన అందరి కర్తవ్యం గా భావించాలి.

– అల్తాఫ్ మీర్, పీహెచ్‌డీ స్కాలర్, జామియా మిలియా ఇస్లామియా, న్యూఢిల్లీ

# 102 ఏళ్ల మహిళను పెళ్లాడిన 100 ఏళ్ల పెళ్లికొడుకు.. ప్రపంచంలోనే మొదటిసారి!

**అమెరికాలో ఆశ్చర్యకర ఘటన**

**ప్రపంచంలో ఇప్పటి వరకు ఇదే అత్యంత వృద్ధ వివాహం**

**ఇద్దరి మొత్తం వయసు 202 సంవత్సరాల 271 రోజులు**

**వీరి వివాహాన్ని గుర్తించి రికార్డు అందజేసిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్**




ప్రేమకు వయసుతో సంబంధం లేదంటారు. దీనిని నిరూపించే ఘటనలు కోకొల్లలు. తాజాగా దీనిని బలంగా నిరూపించే మరో ఘటన అమెరికాలో జరిగింది. 102 ఏళ్ల బామ్మ.. 100 ఏళ్ల వృద్ధుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ప్రపంచంలో ఇప్పటి వరకు ఇదే అత్యంత వృద్ధ పెళ్లి.

102 ఏళ్ల శతాధిక వృద్ధురాలు మార్జోరీ ఫిటర్‌మన్, 100 ఏళ్ల బెర్నీ లిట్‌మన్ ఇద్దరూ మనసులు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆపై పెళ్లి చేసుకుని ఒక్కటయ్యారు. వీరి మొత్తం వయసు 202 సంవత్సరాల 271 రోజులు. ఈ పెళ్లితో గత రికార్డు బద్దలై కొత్తగా వీరి పేరున ప్రపంచ రికార్డు నమోదైంది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే.. వీరిద్దరూ పదేళ్లకుపైగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. వివాహం చేసుకుని తమ బంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాలని భావించిన ఈ జంట ఈ ఏడాది మేలో వివాహ బంధంతో ఒక్కటైంది. తాజాగా ఈ నెల 3న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వీరి వివాహాన్ని గుర్తించి రికార్డు అందజేసింది. అంగరంగ వైభవంగా జరిగిన ఈ శతాధిక వృద్ధ జంట వివాహానికి ఇరు కుటుంబాల వారు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు.




# ఆరోగ్యం



## చలికాలంలో పిల్లలకు అరటిపండు ఇవ్వడం సరైనదా?



కార్బోహైడ్రేట్లు, జింక్, సోడియం, ఐరన్ పుష్కలంగా ఉన్న అరటి పిల్లల మొత్తం అభివృద్ధికి మంచి పండు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పిల్లలకు అరటిపండు ఇవ్వడం వల్ల వారి.. చలికాలంలో ఇంట్లో ఉండే పిల్లలను చలి నుంచి ఎలా కాపాడుకోవాలి? శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో చాలాసార్లు తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. ఒక వైపు పిల్లలు అరటిపండును తినడానికి చాలా ఇష్టపడతారు. ఇప్పుడు చలికాలంలో జలుబుకు కారణమయ్యే వాటికి దూరంగా ఉంచాలి. ఇదిలా ఉండగా చలికాలంలో పిల్లలకు అరటిపండు తినిపించాలా వద్దా ? అనే సందిగ్ధం నెలకొంది. నిజానికి ఇంట్లో పెద్దలు అరటిపండు వల్ల జలుబు వస్తుందని, అందుకే ఈ సీజన్‌లో పిల్లలకు తినిపించకూడదని చెబుతుంటారు. కానీ పిల్లల డెవలప్‌మెంట్ కోసం వారు సరైన పోషకాహారాన్ని పొందడం చాలా ముఖ్యం. ఈ పరిస్థితిలో పిల్లలకి చిన్న పరిమాణంలో కానీ సరైన పరిమాణంలో కానీ ప్రతిదీ తినిపించాలి. దీనితో మొదట పిల్లవాడు ప్రతిదీ తినే అలవాటును పెంపొందించుకుంటాడు. అలాగే రెండవది బిడ్డ కూడా సరిగ్గా అభివృద్ధి చెందుతుంది. చలికాలంలో పిల్లలకు అరటిపండు తినిపించవచ్చా లేదా అనేది ఇప్పుడు తెలుసుకోవడం ముఖ్యం. కార్బోహైడ్రేట్లు, జింక్, సోడియం, ఐరన్ పుష్కలంగా ఉన్న అరటి పిల్లల మొత్తం అభివృద్ధికి మంచి పండు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పిల్లలకు అరటిపండు ఇవ్వడం వల్ల వారి బరువు పెరగడంతోపాటు ఎముకలు దృఢంగా మారడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో పిల్లలకు ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండు ఇవ్వవచ్చు. అరటిపండులో మంచి మొత్తంలో పీచు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి ఉన్నాయి. ఇవి శరీరాన్ని కాలానుగుణ వ్యాధుల నుండి రక్షించడంలో చాలా సహాయపడతాయి. ఏ ఇతర సమస్య లేకపోయినా చలికాలంలో కూడా అరటిపండ్లను పిల్లలకు ఇవ్వవచ్చని నిపుణులు చెబుతున్నారు. కానీ పిల్లలకి జలుబు లేదా దగ్గు ఉంటే అరటిపండు తినిపించడం మంచిది కాదు. ఎందుకంటే అరటిపండు శ్లేష్మం లేదా కఫంతో తాకినప్పుడు చికాకు కలిగిస్తుంది. ఇలాంటి సమయంలో అరటిపండు ఇచ్చే ముందు పిల్లల వైద్యున్ని సంప్రదించి నిర్ణయం తీసుకోవడం మంచిది. అరటిపండు పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పిల్లలు చాలా పరిగెత్తడం వల్ల వారి శక్తి కూడా చాలా త్వరగా ఖర్చు అయిపోతుంటుంది. అటువంటి పరిస్థితిలో అరటి వారికి పవర్‌హౌస్, ఇది వారికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. అరటిపండు కార్బోహైడ్రేట్లు, చక్కెర ఆరోగ్యకరమైన మూలం. ఫైబర్ పుష్కలంగా ఉండే అరటిపండ్లు జీర్ణక్రియకు ఎంతగానో సహకరిస్తాయి. మీ బిడ్డకు యూరినరీ ఇన్ఫెక్షన్ లేదా ఏదైనా రుగ్మత ఉన్నట్లయితే, డాక్టర్‌ని సంప్రదించిన తర్వాత, మీరు పిల్లలకు రోజూ అరటిపండు తినిపించవచ్చు. అటువంటి పరిస్థితిలో అతని పరిస్థితి త్వరలో మెరుగుపడుతుంది. అరటిపండ్లు జ్వరంతో పోరాడడంలో కూడా సహాయపడతాయి.

## రోజుకు ఎన్నిసార్లు చేతులు కడుక్కోవాలి?



మన చర్మంలోని మొదటి పొరలో మనకు మేలు చేసే లక్షలాది బ్యాక్టీరియాలు ఉంటాయి. దీనితో పాటు, ఈ పొర నుండి సహజ నూనెలు బయటకు వస్తాయి. ఇవన్నీ కలిసి మన రోగనిరోధక శక్తిని.. మీ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మంచిది. చేతులు మురికిగా ఉన్నప్పుడల్లా చేతులు శుభ్రం చేసుకోవాలి. కానీ కొందరు చేతులు పదేపదే కడుక్కొంటారు. ఇది మంచి అలవాటు కాదంటున్నారు నిపుణులు. మరి రోజుకు ఎన్ని సార్లు చేతులను శుభ్రం చేసుకోవలో చూద్దాం. దీనికి సంబంధించి, సికె బిర్లా హాస్పిటల్‌లోని ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ తుషార్ తాయల్ మాట్లాడుతూ.. మీరు మీ చేతులను రోజుకు ఎన్నిసార్లు శుభ్రం చేసుకోవాలి..? మీ చేతులు ఎంత మురికిగా ఉన్నాయి ? మీరు ఎలాంటి పని చేస్తారు ? అనే దానిపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. మీరు ఏదైనా పని చేస్తున్నప్పుడు, చాలా దుమ్ము ఉన్నప్పుడు మీరు మీ చేతులను శుభ్రం చేసుకోవాలి. మీరు బయటకు వెళ్లి ఎక్కువసేపు ఉంటే, మీ చేతులు ఖచ్చితంగా మురికిగా మారుతాయి. ఈ పరిస్థితిలో మీరు మీ చేతులను శుభ్రం చేసుకోవాలి. చేతులు శుభ్రపరచడానికి సూత్రం ఏమిటంటే, మీ చేతులపై మురికి కనిపిస్తే, మీరు మీ చేతులను శుభ్రం చేసుకోవాలి. లేకపోతే, మీరు బయటి వ్యక్తులతో పరిచయం ఏర్పడినప్పుడల్లా, మీ ముఖాన్ని తాకినప్పుడు, మీ చేతులను ముందుగా శుభ్రపరచుకోండి. అలాగే ఏదైనా తినే ముందు మీ చేతులను శుభ్రపరచుకోండి. లేదంటే శానిటైజ్ చేసుకోవడం మంచిదంటున్నారు. ఏదైనా మురిగిగా ఉన్నప్పుడు, మీరే చేసే పనిని బట్టి చేతులను శుభ్రం చేసుకోవడం అవసరం. అంతేగానీ ప్రతి దానికి చేతులు శుభ్రం చేసుకోవడం మంచి అలవాటు కాదంటున్నారు. కొంతమంది తమ చేతులను చాలా తరచుగా శుభ్రం చేసుకుంటారు. అది ఇతరులకు ఆందోళన కలిగిస్తుంది. ఇది అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అనే వ్యాధి అని డాక్టర్ తుషార్ తాయల్ చెప్పారు. ఇది ఒక మానసిక స్థితి. పదేపదే అనుమానంతో చేతులను శుభ్రం చేసుకునే వ్యక్తి తన ఆరోగ్యంపై కూడా అనుమానాలు ఉంటాయంటున్నారు. ఇది ఒక పోబియాలాగా. ప్రతి నిమిషానికి మనం చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే, మనకు అనారోగ్యం వస్తుందని భయపడిపోతుంటారు. కొంతమంది తమ ఇళ్లను 10 సార్లు కంటే ఎక్కువ శుభ్రం చేస్తారు. ఇంట్లోకి ఎవరైనా అడుగు పెట్టగానే వెంటనే ఇంటిని శుభ్రం చేయడం మొదలుపెడతారు. ఇది వారి అనుమానం మాత్రమేనని అంటున్నారు. మన చర్మంలోని మొదటి పొరలో మనకు మేలు చేసే లక్షలాది బ్యాక్టీరియాలు ఉంటాయి. దీనితో పాటు, ఈ పొర నుండి సహజ నూనెలు బయటకు వస్తాయి. ఇవన్నీ కలిసి మన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇది బాహ్య ఇన్ఫెక్షన్ల నుండి మనలను రక్షిస్తుంది. అలాంటప్పుడు మళ్లీ మళ్లీ చేతులు కడుక్కుంటే చర్మంలోని మొదటి పొర దెబ్బతినడంతోపాటు అనేక రకాల నష్టాలను చవిచూడాల్సి వస్తుందంటున్నారు. మొదటి పొర తొలగిపోయినట్లయితే ఏదైనా సూక్ష్మ జీవి మీ రక్తప్రవాహంలోకి సులభంగా ప్రవేశించి మీకు ఇన్ఫెక్షన్‌ని ఇస్తుంది. రెండవది మీరు తరచుగా చేతులు కడుక్కుంటే చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుంది. దాని మెత్తదనం పోతుంది. చర్మం కూడా మళ్లీ మళ్లీ వాచిపోతుంది. అలాగే మీరు నొప్పిని కూడా అనుభవిస్తారు. అందువల్ల, అవసరమైనంత వరకు మాత్రమే చేతులు కడుక్కోవాలి. చేతులు మురికిగా కనిపించినప్పుడు మాత్రమే కడగాలి. చాలా అవసరాలను శానిటైజ్ చేయడం ద్వారా మంచిదంటున్నారు.

## రక్తంలో బ్లడ్ లెవల్స్ అదుపు చేసే కీర..



నేటి కాలంలో ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతున్న లైఫ్ స్టైల్ సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. ఇది చిన్న వయసులోనే దాడి చేయకుండా ఉండాలంటే రోజూ ఆహారంలో కీర తప్పకుండా తీసుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు.. నేటి కాలంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు కూడా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ ఈ వ్యాధి వేధిస్తోంది. ఈ ఆరోగ్య సమస్య ఉన్నవారికి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. అందుకే తినే ఆహారం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. నేటి కాలంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు కూడా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ ఈ వ్యాధి వేధిస్తోంది. ఈ ఆరోగ్య సమస్య ఉన్నవారికి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. అందుకే తినే ఆహారం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. మధుమేహంతో బాధపడేవారు తరచుగా మూత్ర విసర్జన సమస్యలతో బాధపడుతుంటారు. తరచుగా మూత్రవిసర్జన చేయడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. ఈ సమస్యను నివారించాలంటే కీరదోస క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా బరువు పెరగడం వల్ల బ్లడ్ షుగర్ లెవెల్స్ ఎక్కువగా ఉంటాయి. అయితే కీరదోస తినడం స్థూలకాయాన్ని నివారిస్తుంది. బరువును నియంత్రిస్తుంది. శరీరంలో స్థూలకాయం పెరిగితే మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి కీరదోస ఊబకాయం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. తద్వారా బ్లడ్ షుగర్ కూడా కంట్రోల్‌లో ఉంటుంది. కీరదోసలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. దీన్ని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల శరీరానికి శక్తిని అందించి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కీరదోసకాయలో పీచు ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ఆహారాన్ని జీర్ణం చేసి కడుపు సమస్యలను నివారిస్తుంది. కీరదోసలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. దీని ఆరోగ్యానికి మేలు చేయడంతోపాటు కంటి చూపును మెరుగుపరచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. కీరదోసను లంచ్‌లో సలాడ్ లేదా డిన్నర్‌లో సైడ్ డిష్‌గా తినవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

## బాటిల్ వాటర్ ఇంత ప్రమాదకరమా..?



ఇప్పుడు ఏది తినాలన్నా.. ఏది తాగాలన్నా.. భయమేస్తోంది.. ఎంతో ఖర్చు చేసి ఆహార పదార్థాలను కొనుక్కోని మరి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.. బయట షాపుల్లో కొనుక్కోని వాటర్ బాటిల్ లోని నీళ్లు తాగినా ప్రమాదకరమేనని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు ఏది తినాలన్నా.. ఏది తాగాలన్నా.. భయమేస్తోంది.. ఎంతో ఖర్చు చేసి ఆహార పదార్థాలను కొనుక్కోని మరి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.. బయట షాపుల్లో కొనుక్కోని వాటర్ బాటిల్ లోని నీళు తాగినా ప్రమాదకరమేనని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ (బాటిల్ వాటర్)ని హై రిస్క్ ఫుడ్ కేటగిరీలో చేర్చింది. ఈ మేరకు ఖీూూ× కొత్త నిబంధనలను జారీ చేసింది. దీని ప్రకారం ఇప్పుడు బాటిల్ వాటర్ విక్రయించే అన్ని కంపెనీలను ఏడాదికి ఒకసారి తనిఖీ చేస్తారు. నీటి నాణ్యతను తనిఖీ చేయడానికి ఈ పని జరుగుతుంది. ఖీూూ× హై రిస్క్ కేటగిరీలో బాటిల్ వాటర్‌ను చేర్చడంపై డాక్టర్ ఎం వలీ మాట్లాడుతూ.. చాలా కాలం తర్వాత ఈ అడుగు వేశామని పేర్కొన్నారు.. చాలా కాలంగా, ప్రజలు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నుండి నీటిని తాగుతున్నార.. దీని కారణంగా మైక్రో ప్లాస్టిక్ శరీరంలోకి ప్రవేశిస్తోంది. మైక్రో ప్లాస్టిక్ కూడా ప్రజల మెదడులోకి ప్రవేశిస్తోంది. కాబట్టి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎలాంటి కొత్త నిబంధనలను రూపొందించినా వెంటనే అమలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బాటిల్ వాటర్‌లోని మైక్రో ప్లాస్టిక్ శరీరానికి హాని కలిగిస్తుందని తెలిసినందున కొన్ని పెద్ద హొటళ్లు చాలా కాలం క్రితం గాజు సీసాలలో నీటిని అందించడం ప్రారంభించాయని డాక్టర్ వలీ చెప్పారు. ఇంతకు ముందు కుండ నీళ్లు తాగేవారని, ఇప్పుడు ఇంట్లో కుండ, స్టీల్ బిందెలు కూడా లేవని డాక్టర్ వలీ చెప్పారు. ఇప్పుడు వాటి స్థానంలో ప్లాస్టిక్ బాటిళ్లు వచ్చాయి. ఈ బాటిళ్లలో ప్లాస్టిక్‌తో పాటు శరీరానికి హాని కలిగించే ఎన్నో ప్రమాదకరమైన అంశాలు ఉన్నాయన్నారు. ఈరోజుల్లో నీళ్లే కాకుండా పాలు కూడా ప్లాస్టిక్ బాటిళ్లలో వస్తాయని, దీని వల్ల మైక్రో ప్లాస్టిక్ మనిషి శరీరంలోకి చేరుతుందని డాక్టర్ వలీ చెప్పారు. మైక్రో ప్లాస్టిక్ శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తుందని.. ఇది ఒక మంచి అడుగు అంటూ ప్రశనించారు.. దీనిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు బదులు ఇంట్లో ఉన్న నీటిని మరిగించి తాగాలని ప్రజలకు సూచించారు. దీని వల్ల ఎలాంటి నష్టం ఉండదన్నారు. మైక్రో ప్లాస్టిక్ వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని.. ఆరోగ్యానికి హాని కలగకుండా ఆహార పదార్థాలను ప్యాక్ చేసే విధానంపై కూడా శ్రద్ధ పెట్టాలని డాక్టర్ వలీ సూచించారు.. దీని ప్రభావం కొంత కాలం తర్వాత తెలుస్తుందన్నారు.. ఇప్పుడు కూడా ప్రజల జ్ఞాపకశక్తి బలహీనంగా మారుతోంది. ప్రస్తుత కాలంలో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయి. ఇది గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రధాన వ్యాధులకు కారణమవుతుంది. ఆరోగ్యంపై మైక్రో ప్లాస్టిక్ ప్రభావంపై అనేక రకాల పరిశోధనలు కూడా జరిగాయి. మైక్రోప్లాస్టిక్ మెదడుకు కూడా హాని చేస్తుందని అధ్యయనాలు తెలిపాయి..

## ఆకుకూరలు పోషకాలు పోవద్దంటే ఇలా కుక్ చేయండి..

ఆకు కూరలు తింటే ఆరోగ్యం పథిలంగా ఉంటుంది. త్వరగా వ్యాధులు ఎటాక్ చేయకుండా ఉంటాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అయితే ఆకు కూరలను వండటం ఎవరికీ తెలీదు. ఎలా పడితే అలా వండితే అందులో ఉండే పోషకాలు పోతాయి.

ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఆకు కూరల్లో అనేక రకాల పోషకాలు లభిస్తాయి. వారంలో రెండు, మూడు సార్లు అయినా ఆకు కూరలు వండుకుని తినడం చాలా మంచిది. ఆకు కూరలు తినడం వల్ల శరీరంలో ఉండే మలినాలు అన్నీ పోతాయి. అయితే ఆకు కూరల్ని ఎలా వండాలో చాలా మందికి తెలీదు. తెలీకుండా ఎలా పడితే అలా వండటం వల్ల పోషకాలు అన్నీ పోతాయి. దీని వల్ల ఆకు కూరల్ని తిన్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. మరి ఆకు కూరల్ని ఎలా వండితే ప్రయోజనాలు అందుతాయో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా ఆకు కూరల్ని కట్ చేసి కడుగుతారు. కానీ ముందు కడిగేసి కట్ చేయడం వల్ల పోషకాలు ఉంటాయి. ఒక వేళ ఇలా చేయడం ఇబ్బంది అవుతుంది అనుకుంటే.. కట్ చేశాక కడిగి, కాసేపు వేడి నీళ్లు పోసి ఉంచండి. ఇలా చేయడం వల్ల పోషకాలు అందుతాయి.అదే విధంగా ముందుగానే ఆకు కూరల్ని స్టీమ్ చేసి వండటం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. మరీ ఎక్కువ సేపు ఉడికించినా కూడా పోషకాలు అనేది అందవు. కాబట్టి ఎక్కువ సేపు వేయించకుండా వండాలి. ఆకు కూరలు వండేటప్పుడు ఆయిల్‌తో కాకుండా వెన్న, నెయ్యితో వండితే పోషకాలు అనేవి పోకుండా ఉంటాయి. మరీ ఎక్కువగా నెయ్యి కాకుండా.. కొద్దిగా ఆయిల్ కూడా వాడుకోవచ్చు. పెద్ద మంట మీద కుండా.. చిన్న మంట మీద ఉడికిస్తే పోషకాలు లభిస్తాయి.



# వ్యాపారం



## బుల్ జోష్‌లో స్టాక్ మార్కెట్లు.. ఏడాదిలో లక్ష దాటనున్న సెన్సెక్స్



మోర్గాన్ స్టాన్లీ ఆర్థిక, సాంకేతికత, పారిశ్రామిక రంగాలపై సానుకూలంగా ఉందని, ఇతర రంగాలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా, ఇటీవలి క్షీణత తర్వాత చిన్న, మధ్యస్థ కంపెనీల స్టాక్‌లు భారీ స్టాక్‌లను అధిగమించవచ్చు అంటూ తెలిపింది. వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత స్టాక్ మార్కెట్ 2025లో అత్యుత్తమ పనితీరును కనబరుస్తుందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. తాజాగా అందించిన నివేదిక ప్రకారం, బీఎస్‌ఈ సెన్సెక్స్ 105,000 వరకు వెళ్లవచ్చని అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ తెలిపింది. ఇందుకు బలమైన ఆదాయాలు, ఆర్థిక స్థిరత్వంతోపాటు దేశీయ పెట్టుబడి కారణంగా ఉంటుందని చెప్పుకొచ్చింది. మోర్గాన్ స్టాన్లీ ప్రకారం, సెన్సెక్స్ 105,000కి చేరుకునేందుకు 30 శాతం అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 93,000 వరకు వెళ్లవచ్చు అని ఉద్ఘాటించింది. ఇది ప్రస్తుత స్థాయి కంటే 14% ఎక్కువగా ఉంటుంది. మోర్గాన్ స్టాన్లీకి చెందిన రిధమ్ దేశాయ్ ప్రకారం, భారతదేశం ఆర్థిక క్రమశిక్షణను కొనసాగిస్తే, ప్రైవేట్ పెట్టుబడులను పెంచి, వడ్డీ రేట్లు, వృద్ధి మధ్య సమతుల్యతను కొనసాగిస్తే, సెన్సెక్స్ 23ఇ ్రా/జు నిష్పత్తిలో ట్రేడ్ అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఇది గత 25 సంవత్సరాల సగటు కంటే 20 రెట్లు ఎక్కువ ఉంది. ప్రతిదీ సాధారణంగా ఉంటే, సెన్సెక్స్ ఆదాయాలు ప్రతి సంవత్సరం 17% పెరుగుతాయని మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది. ఇందుకోసం, ఆర్థిక సంస్కరణలు, స్థిరమైన రిటైల్ పెట్టుబడి, నియంత్రిత స్టాక్ సరఫరా ఉండాలని సూచించింది. దీనితో పాటు భారత ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం, ప్రభుత్వ సంస్కరణలు, విదేశీ పెట్టుబడులు పెరగడం సెన్సెక్స్‌కు సానుకూల సంకేతాలుగా ఉంటాయని తెలిసింది.

## లైట్ వాలెట్‌పై లావాదేవీ పరిమితి పెంపు..




చిన్న చెల్లింపుల కోసం యూపీఐ లైట్ ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వినియోగదారులు ఇంటర్నెట్ లేకుండానే దీని ద్వారా లావాదేవీలు చేయవచ్చు. ఆఫ్లైన్ చెల్లింపుల కింద ఫోన్ లో ఇంటర్నెట్, ఎలాంటి నెట్ వర్క్ లేకపోయినా చెల్లింపులు చేయవచ్చు. అంతేకాకుండా.. యూపీఐ వినియోగదారులు ఎలాంటి పిన్ ను నమోదు చేయకుండానే లావాదేవీలు చెల్లించవచ్చు. ఈ క్రమంలోనే యుపిఐ గురించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. యూపీఐ లావాదేవీల పరిమితిని పెంచడానికి ఆర్బీఐ గవర్నర్ శక్తి కాంత దాస్ ఆమోదం తెలిపారు. వినియోగదారులకు ప్రతి లావాదేవీ పరిమితి రూ. 1000గా మారింది. ఇక వాలెట్ లావాదేవీ పరిమితి అయితే రూ.2000 నుంచి రూ.5000కి పెరిగింది. ఒక్కో చెల్లింపుల పరిమితి రూ.500 నుంచి రూ.1000కి పెరిగింది.

## ఆర్థిక కేంద్రంగా క్షీణిస్తోన్న లండన్



లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎల్ఎస్ఈ)లో నమోదైన కంపెనీల సంఖ్య గత పదేండ్లలో తగ్గుముఖం పట్టడం వేగవంతమైందని తాను సంకలనం చేసిన డేటాను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. 2024లో దాదాపు 45 సంస్థలు లండన్ స్టాక్ మార్కెట్ నుంచి తొలగించబడినట్టు తెలుస్తోంది. ఇది గత సంవత్సరం మొత్తం కంటే 10 శాతం ఎక్కువ. 2010 నుండి ఎక్స్ఛేంజ్ నుంచి నిష్క్రమించిన కంపెనీలు ఈ సంవత్సరం అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. అదే సమయంలో, బ్రిటిష్ కార్పొరేషన్లను లక్ష్యంగా చేసుకున్న ఒప్పందాల పరిమాణం ఈ సంవత్సరం 81 శాతం పెరిగింది. వీటి విలువ 160 బిలియన్లకు పైగా ఉంది.వార్తా ఏజెన్సీ ద్వారా ట్రాక్ చేయబడిన డేటా కూడా ప్రస్తుత సంవత్సరం లో లండన్‌లో కేవలం 11 కంపెనీలు మాత్రమే ఐపీఓలను పూర్తి చేశాయని చూపిస్తుంది. ఇవి సమీకరించిన మొత్తం 1 బిలియన్. ఇది 2023లో అదే కాలంలో సేకరించిన మొత్తంతో పోలిస్తే 11 శాతం తగ్గింది. "బ్రిటన్ ఈ పరిస్థితిని సరిదిద్దక పోతే, అది తన స్థానాన్ని, ప్రాసంగికతను కోల్పోతుంది" అని పెట్టుబడి సంస్థ గేట్‌మోర్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌లో మేనేజింగ్ భాగస్వామి లియాడ్ మీదర్ బ్లూమ్‌బెర్గ్‌తో అన్నారు. "చాలా సరళంగా, కంపెనీలు సరైన మూలధన ధరను పొందలేవు. వారు కోరుకున్న విలువను పొందలేరు". విలీనాలు, కొనుగోళ్ల విషయానికి వస్తే ఓవర్సీస్ ప్రయివేట్ ఈక్విటీ సంస్థలు ప్రత్యేకంగా చురుకుగా ఉన్నాయని వార్తా సంస్థ పేర్కొంది. నవంబర్‌లో, ఫ్లోరిడాకు చెందిన స్టార్‌వుడ్ క్యాపిటల్ గ్రూప్ గత నెలలో లండన్-లిస్టెడ్ బ్యాలెన్స్‌డ్ కమర్షియల్ ప్రాపర్టీ ట్రస్ట్‌ను 852 మిలియన్లకు స్వాధీనం చేసుకుంది. స్వీడన్‌కు చెందిన ఇక్యూటి ఇటీవల వీడియో గేమ్ సేవల కంపెనీ కీవర్డ్స్ స్టూడియోస్ 2.7 బిలియన్ల కొనుగోలును మూసివేసింది. అయితే చికాగోకు చెందిన థామా బ్రావో సైబర్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ డార్క్ ట్రేస్‌ను 5.3 బిలియన్లకు కొనుగోలు చేసింది. సమీప భవిష్యత్తులో మరిన్ని కొత్త ఒప్పందాలు రానున్నాయని మీడియా సంస్థ పేర్కొంది. బ్రిటన్-ఆధారిత భీమా దిగ్గజం అవివా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అమండా బ్లాంక్, 4.2 బిలియన్ల టేకోవర్ బిడ్ చేసిన తర్వాత ప్రత్యర్థి డైరెక్ట్ లైన్ ఇన్సూరెన్స్ గ్రూప్ బోర్డుని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అదే సమయంలో అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ మేజర్ జనరల్ అట్లాంటిక్ ఆన్‌లైన్ ట్రైనింగ్ బిజినెస్ లెర్నింగ్ టెక్నాలజీస్ గ్రూప్‌ను 1 బిలియన్‌కు కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది.

### అమెరికాలో ఇషా అంబానీ బంగ్లాను కొన్న హాలీవుడ్ స్టార్ కపుల్..

ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ అమెరికాలోని బెవర్లీ హిల్స్‌లో తన విలాసవంతమైన ఇంటిని విక్రయించింది. హాలీవుడ్‌కు చెందిన స్టార్ కపుల్ ఈ లగ్జరీ బంగ్లాను కొనుగోలు చేశారు. ఇంతకీ ఇషా అంబానీ బంగ్లా ఎన్ని కోట్లకు అమ్ముడైందో తెలుసా? ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ తన తండ్రిలాగే మంచి పారిశ్రామికవేత్తగా ముద్ర వేసుకుంది. ఇషా అంబానీకి భారత్‌తో సహా అనేక దేశాల్లో విలాసవంతమైన బంగ్లాలు ఉన్నాయి. అయితే తాజాగ ఆమె అమెరికాలోని తన విలాసవతమైన ఇంటిని విక్రయించింది. హాలీవుడ్‌లోని ప్రముఖ జంట ఇషా అంబానీ ఇంటిని కొనుగోలు చేసింది. అది కూడా భారీ ధరకే. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. హాలీవుడ్‌లోని బెవర్లీ హిల్స్‌లో ఇషా అంబానీకి భారీ ఇల్లు ఉంది. 5.2 ఎకరాల్లో విస్తీర్ణంలో అత్యంత విలాసవంతమైన ఈ ఇల్లు ఇషా అంబానీ పేరు మీదగానే ఉంది. సుమారు 10 సంవత్సరాల క్రితం ఈ ఇంటిని కొనుగోలు చేశారామె. అయితే ఈ లగ్జరీ ఇంట్లో ఇషా అంబానీ ఈ ఇంట్లో చాలా తక్కువ కాలం మాత్రమే ఉన్నారు. గర్భంతో ఉన్నప్పుడు అంటే 2022లో ఇషా ఇక్కడే గడిపారు. ఆ సమయంలో ఆమె తల్లి అనితా అంబానీ కూడా ఈ ఇంట్లోనే ఉన్నారు. అయితే ఇప్పుడు ఈ ఇల్లు అమ్ముడుపోయింది. ఈ ఇంటిని గత ఐదేళ్లుగా అమ్మకానికి ఉంచారు. చివరకు హాలీవుడ్ స్టార్ కపుల్ జెన్నిఫర్ లోపెజ్ బెన్ అఫ్లెక్ ఈ ఇంటిని రూ. 508 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ ఇంట్లో 12 బెడ్‌రూమ్‌లు, 24 బాత్‌రూమ్‌లు ఉన్నాయి. అలాగే విశాలమైన స్విమ్మింగ్ పూల్, పికిల్ బాల్ కోర్ట్, విశాలమైన వినోద ప్రదేశం, సెలూన్, ప్రైవేట్ జిమ్, విశాలమైన డైనింగ్ ఏరియాతో పాటు అనేక ఇతర విలాసవంతమైన సౌకర్యాలు ఉన్నాయి. హాలీవుడ్ స్టార్ నటుల్లో బెన్ అఫ్లెక్ ఒకరు. అతను ఆస్కార్ విజేత 'అర్గో', 'గాన్ గర్ల్' సహా పలు టాప్ హాలీవుడ్ సినిమాల్లో నటించాడు. బెన్ అఫ్లెక్ 'జస్టిస్ లీగ్' సినిమా సిరీస్‌లో బ్యాట్‌మ్యాన్ పాత్రను కూడా పోషించాడు. ఇక అతని భార్య జెన్నిఫర్ లోపెజ్, పాప్ ప్రపంచంలో అతిపెద్ద స్టార్. ఈమెకు భారత్ తో పాటు ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ ఉంది.

## రైతులకు రుణ పరిమితి పెంపు



ముంబయి : అధిక వడ్డీ రేట్లతో ఒత్తిడిని ఎదుర్కొంటున్న రుణ గ్రహీతలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు నిరాశనే మిగిల్చింది. మరోవైపు రైతులకు రుణ పరిమితిని పెంచి.. వ్యవసాయ రంగానికి కొంత ఉపవశమనం కలిగించింది. డిసెంబరు 4 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షా (ఎంపిసి) భేటీ నిర్ణయాలను శుక్రవారం ఆర్‌బిఐ గవరుర్ శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. చిను, సనుకారు రైతులకు తనఖా రహిత వ్యవసాయ రుణాల పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతున్నామన్నారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.1.6 లక్షలుగా ఉంది. పెంచిన రుణ పరిమితిని రైతులు ఎలాంటి తనఖా లేకుండా బ్యాంక్‌ల నుంచి పొందవచ్చన్నారు. పెట్టుబడి ఖర్చులు, ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని రుణ పరిమితిని పెంచామని శక్తికాంత తెలిపారు. ఇంతక్రితం 2019లో ఈ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.1.6 లక్షలకు పెంచుతూ ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. కీలక వడ్డీ రేట్లను వరుసగా 11వ సారి యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. అయితే బ్యాంకుల్లో నగదు లభ్యత సమస్యలను పరిష్కరించాలని భావించినట్లు శక్తికాంత తెలిపారు. ఇందుకోసం నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్‌ఆర్)ను 4.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గించామన్నారు. దీంతో బ్యాంకులు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ నిర్ణయంతో బ్యాంకింగ్‌లోకి అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఖాతాదారుల డిపాజిట్లలో కొంత సొమ్మును ఆర్‌బిఐ వద్ద జమ చేయడమే సిఆర్‌ఆర్. దీంతో డిపాజిట్‌దారుల సొమ్ముకు రక్షణ కల్పించాలనేది దీని ప్రధాన ఉద్దేశ్యం. అదే విధంగా ఇకపై చిను బ్యాంకులు కూడా యుపిఐ ద్వారా క్రెడిట్ లైన్‌ను ఆఫర్ చేసేందుకు అనుమతి కల్పించినట్లు శక్తికాంత తెలిపారు. వరుసగా 11వ సారి రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు శక్తికాంత వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి ఈ వడ్డీ రేటు మారలేదు. ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొనిఈసారి కూడా మార్పులు చేయొద్దనినిర్ణయించామన్నారు. 2024-25లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు 6.6శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. గత సమీక్షాలో ఈ అంచనా 7.2 శాతంగా ఉంది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాల కంటే భారీగా తగ్గి 5.4 శాతంగా నమోదయ్యింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202425కుగాను జిడిపి అంచనాలకు భారీగా కోత పెట్టింది. ఇంతక్రితం 202324లో ఏకంగా 8.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. దీంతో పోల్చితే భారీగా తగ్గనుందనిస్పష్టమవుతోంది. 202425లో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బిఐ పెంచింది. గతంలో దీన్ని 4.5శాతంగా పేర్కొనగా.. తాజాగా 4.8శాతానికి పెరగొచ్చనివిశ్లేషించింది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణం అంచనాలను పెంచాల్సి వచ్చిందనిశక్తికాంత తెలిపారు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు బలంగా కొనసాగుతున్నాయన్నారు. రూపాయి విలువను బలోపేతం చేసేందుకు ఎన్‌ఆర్‌ఐ డిపాజిట్లపై వడ్డీరేటు పరిమితిని పెంచుతున్నామన్నారు.

# సినిమా




## అతిథి పాత్రల్లో యంగ్ హీరోలు..?



నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరిలు ముఖ్య పాత్రల్లో దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం డాకు మహారాజ్. ఇటీవల విడుదలైన టైటిల్ టీజర్‌లో బాలకృష్ణ సరికొత్త లుక్, అద్భుతమైన విజువల్స్ కట్టిపడేశాయి. తాజాగా 'డాకు మహారాజ్' చిత్రీకరణ పూర్తయిందని నిర్మాతలు ప్రకటించారు. అయితే ఈ సినిమాలో ప్రేక్షకులను థ్రిల్ చేసే విధంగా క్రేజీ అతిథి పాత్రలు ఉంటాయని తెలిసింది. టాలీవుడ్‌లోని కొందరు యంగ్ హీరోలు అతిథి పాత్రల్లో కనిపించి ఆశ్చర్యపరచబోతున్నారట. ముందుగా ప్రకటించినట్లుగానే సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. 'డాకు మహారాజ్' చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.

## సాగర్ పాత్రలో వింటేజ్ లుక్



హీరో ఉస్తాద్ రామ్ పోతినేని క్యారెక్టర్లు, లుక్స్ పరంగా ఎప్పటికప్పుడు విభిన్నంగా కనిపిస్తూ ప్రేక్షకులను అలరిస్తుంటారు. ఇప్పుడు మరో కొత్త లుక్, క్యారెక్టర్‌తో హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆయన కథానాయకుడిగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో యువ దర్శకుడు మహేష్ బాబు పి తెరకెక్కిస్తున్న సినిమా హీరో క్యారెక్టర్ లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈ సినిమా హీరోగా రామ్‌కు 22వది. ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. ఈ సినిమాలో సాగర్ పాత్రలో రామ్ నటిస్తున్నారు. శుక్రవారం ఆయన క్యారెక్టర్ లుక్ విడుదల చేశారు. 'మీకు సుపరిచితుడు మీలో ఒకడు మీ సాగర్' అం టూ రామ్ పాత్రను పరిచయం చేశారు దర్శకుడు మహేష్ బాబు. రామ్ క్యారెక్టర్ లుక్ చూస్తే వింటేజ్ ఫీలింగ్ కలుగుతుంది. పాత రోజుల్లో ఉపయోగించే సైకిల్, రామ్ లాంగ్ హెయిర్, క్లీన్ షేవ్, అన్నిటికి మించి రామ్ ముఖంలో నవ్వు ఫస్ట్ లుక్ చూడగానే ఒక ఆహ్లాదకరమైన ఫీలింగ్ కలుగుతోంది. ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో పాటు శుక్రవారం రెగ్యులర్ షూటింగ్ మొదలైందని దర్శక నిర్మాతలు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. రామ్ జంట గా భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది.

## 'స్పిరిట్' మూవీని ఆదరించండి



'కష్టపడిన వారికి ఎప్పుడైనా ఫలితం దక్కుతుంది. శ్రమజీవికి కష్టం, శ్రమ విలువ తెలుసు. అందుకే ఈ సినిమాను ఎంతో ప్రాణం పెట్టి తీశారు. ఖచ్చితంగా ఈ సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం నాకుంది. రాయలసీమ ప్రాంతంలో నేటికీ కొనసాగుతున్న మాతంగుల జీవన విధానంపై ఈ సినిమాను తీశారు. గ్రామాల్లో పెత్తందారులు సాగించే దురాగతాలను కళ్లకు కట్టినట్లుగా ఈ సినిమాలో చూపించారు. అందరూ ఈ సినిమాను ఆదరించాలి. సామాజిక దృక్పథంతో దురాచారాలను ఎండగడుతూ తీసిన 'స్పిరిట్' మూవీ మంచి విజయాన్ని సాధించాలి. ఒక రైతు మహిళ కుటుంబం తన జీవితంలో శ్రమించిన డబ్బంతా ఈ సినిమాలో పెట్టింది. ' అని నటుడు సుమన్ కోరారు. హార్రర్ జోనర్‌లో చెన్నెబోయిన చిన్న వెంకటస్వామి సమర్పణలో 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై 'స్పిరిట్(ఈజ్ నాట్ వన్)' సినిమా త్వరలో విడుదల కానుంది. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను తదితరులు ప్రధాన తారాగణం. రమ్య, ప్రియ, పింకీ నూతన పరిచయం. యూట్యూబ్‌లో రైతు నర్సమ్మ గురించిన వీడియోలు చూసి తానే హైదరాబాద్‌కు పిలిపించుకుని 'స్పిరిట్' మూవీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్మాత చెన్నెబోయిన వెంకట నర్సమ్మ, ఆమె భర్త చెన్నెబోయిన చిన వెంకటస్వామిలను అభినందించారు. ఈ సందర్భంగా నిర్మాత చెన్నెబోయిన వెంకట నర్సమ్మ మాట్లాడుతూ ఈ సినిమాలో మొత్తం మూడు పాటలు, రెండు ఫైట్లు ఉన్నాయన్నారు. వాటిలో ఒక పాటను చిత్రం శ్రీను ఆలపించారన్నారు. ఈ సినిమాకు దర్శకత్వం సిహెచ్. వెంకటరవీంద్రనాథ్ (ఎంఎస్), సంగీతం సంతోష్ కావాలి, సినిమాటోగ్రఫీ పి.భరత్‌రాజ్‌కమల్, ఎడిటర్ కెవివై పాపారావు వ్యవహరిస్తున్నారు.

## స్నేహితుడి కోసం..

స్నేహితుడి కోసం..పిల్లలు, పెద్దలు అందరూ ఇష్టంగా తినే ఐస్ క్రీమ్‌లను రుచితో పాటు నాణ్యతతో అందించడమే లక్ష్యంగా 'డెయిరీ ట్రెండ్స్' అనే సంస్థను స్థాపించారు శ్యాంసుందర్ రెడ్డి. శుక్రవారం అమీర్‌పేట్ మ్యారిగోల్డ్ హెూటల్‌లో డెయిరీ ట్రెండ్స్ సంస్థ లోగో, ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, హీరో విశ్వక్‌సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,'రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్ళడంలో, ఉపాధి కల్పనలో ప్రైవేట్ రంగ సంస్థలు, వ్యాపార పరిశ్రమలు ఎంతో కీలకం' అని తెలిపారు. 'ఇది కమర్షియల్ ఈవెంట్ కాదు. నా స్నేహితుడి కోసం ఇక్కడకు వచ్చాను. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఇద్దరం కలిసి చదువుకున్నాం. నాకు లాంచింగ్ విషయం తెలియగానే, నేనే వస్తా అని చెప్పా. 'లైలా' షూటింగ్ కోసం నైట్ షెడ్యూల్స్ జరుగుతున్నాయి. లుక్ రివీల్ కాకూడదని అనుకున్నా. కానీ మాస్క్ పెట్టుకుని వస్తే బాగోదని ఇలా వచ్చేశా. డెయిరీ ట్రెండ్స్ ఐస్ క్రీమ్ బ్రాండ్ బాగా పాపులర్ అవ్వాలి. నా మిత్రుడికి మంచి పేరు తీసుకురావాలి. ఐస్ క్రీమ్ అంటే ఇష్టపడని వాళ్లు ఎవరూ ఉండరు. ప్రతి ఒక్కరికీ కావాల్సిన అన్ని ఫ్లేవర్స్ కూడా డెయిరీ ట్రెండ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. నేను కూడా టేస్ట్ చేశాను. అన్ని ఫ్లేవర్స్ చాలా టేస్టీగా ఉన్నాయి. అలాగే క్వాలిటీ కూడా చాలా బాగుంది. అందరూ తప్పకుండా టేస్ట్ చేయండి' అని విశ్వక్‌సేన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ట్రెండ్స్ సీఈవో శ్యాంసుందర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నిర్మాత బండ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## పవర్‌ఫుల్ కంటెంట్‌తో పాన్ ఇండియా సినిమా

'విరూపాక్ష', 'బ్రో' వంటి బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత హీరో సాయి దుర్గ తేజ్ ఓ పాన్ ఇండియా సినిమాలో నటిస్తున్నారు. ఇది ఆయన హీరోగా నటిస్తున్న 18వ చిత్రం. నూతన దర్శకుడు రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నారు. 'హనుమాన్' వంటి సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మేకర్స్ లేటెస్ట్‌గా ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈనెల 12న ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ మెంట్, గ్లింప్స్‌ని రిలీజ్ చేస్తున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే విడుదలైన 'ఇంట్రూడ్ ఇన్‌టు ది వరల్డ్ ఆఫ్ ఆర్కాడీ' వీడియోకి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఓ అద్భుతమైన ప్రపంచాన్ని క్రియేట్ చేయడంలో ప్రొడక్షన్ టీమ్ డెడికేషన్‌ని ఈ వీడియో ప్రజెంట్ చేసింది. ఇందులో సాయి దుర్గ తేజ్ మునుపెన్నడూ చేయని పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు. ఆయన సరసన హీరోయిన్‌గా ఐశ్వర్య లక్ష్మి నటిస్తోంది. బి.అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందించనున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్, అనన్య నాగళ్ల తదితరులు ఇతర ముఖ్యతారాగణం.

## యాక్షన్ సన్నివేశాలతో అదరగొట్టిన టీజర్



బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ యాక్షన్- ప్యాక్డ్ మూవీ 'జాట్' కోసం మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో తొలిసారి కలిసి పనిచేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌తో భారీ అంచనాలను సృష్టించింది. తాజాగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. పూర్తి యాక్షన్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. యాక్షన్ సన్నివేశాల్లో సన్నీ డియోల్ అదరగొట్టాడు. రణదీప్ హుడాను మెయిన్ విలన్‌గా పరిచయం చేయడంతో టీజర్ థ్రిల్లింగ్ నోట్‌తో ముగిసింది. దర్శకుడు గోపీచంద్ మలినేని మాస్ -అప్పీలింగ్ యాక్షన్‌ని తీయడం లో తన ప్రతిభను అద్భుతంగా చూపించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లపై నిర్మించిన ఈ సినిమా నిర్మాణ విలువలు అత్యద్భుతంగా ఉన్నాయి. తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రిషి పంజాబీ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని అబ్బురపరిచే విధంగా చూపించాయి. ఈ చిత్రంలో వినీత్ కుమార్ సిం గ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏప్రిల్ 2025 వేసవిలో ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.



# క్రీడలు



## అడిలైడ్ టెస్టులో భారత్ ఘోర ఓటమి

**10 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు**

**19 పరుగుల సునాయాస లక్ష్యాన్ని ఛేదించిన ఆతిథ్య జట్టు**

**రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమైన భారత బ్యాటర్లు**




బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య అడిలైడ్ వేదికగా మొదలైన రెండవ టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఘోరంగా ఓడిపోయింది. రెండవ ఇన్నింగ్స్‌లో భారత్ 175 పరుగులకే ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోరు 128/5 వద్ద మూడవ రోజు ఆరంభమైంది. కేవలం మరో 47 పరుగులు మాత్రమే జోడించి భారత్ ఆలౌట్ అయింది. కేవలం 18 పరుగుల ఆధిక్యం మాత్రమే లభించింది. దీంతో ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా విజయ లక్ష్యం కేవలం 19 పరుగులుగా ఉంది. ఈ సునాయాస లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఓపెనర్లు మెక్‌స్వీని 10, ఉస్మాన్ ఖవాజా 9 ఛేదించారు. దీంతో 10 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టు ఘన విజయం సాధించింది.

రెండవ ఇన్నింగ్స్‌లో కూడా 42 పరుగులతో నితీశ్ కుమార్ రెడ్డి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లలో జైస్వాల్ 24, కేఎల్ రాహుల్ 7, శుభ్‌మాన్ గిల్ 28, విరాట్ కోహ్లీ 11, రిషబ్ పంత్ 28, రోహిత్ శర్మ 6, రవిచంద్రన్ అశ్విన్ 7, హర్షిత్ రానా 0, జస్ప్రీత్ బుమ్రా 2 (నాటౌట్), సిరాజ్ 7 చొప్పున పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో కెప్టెన్ ప్యాట్స్ కమ్మిన్స్ అత్యధికంగా 5 వికెట్లు తీశాడు. బోలాండ్ 3, మిచెల్ స్టార్క్ 2 వికెట్లు తీశారు. కాగా మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 180 పరుగులకు ఆలౌట్ అవ్వగా.. 337 పరుగులు సాధించిన ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 157 రన్స్ ఆధిక్యం లభించింది. ఇక రెండవ ఇన్నింగ్స్‌లో ఇండియా 175 పరుగులకే ఆలౌట్ కావడంతో ఆస్ట్రేలియా విజయం లక్ష్యం అతి స్వల్పంగా ఉంది.

కాగా 5 మ్యాచ్‌ల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 1-1తో ఇరు జట్లు సమంగా నిలిచాయి.

## హైదరాబాదీ పేసర్ సిరాజ్‌పై సునీల్ గవాస్కర్ విమర్శలు

**సెంచరీ హీరో ట్రావిస్ హెడ్‌కు ఆగ్రహంతో సెండ్ ఆఫ్ ఇవ్వాల్సిన అవసరం లేదన్న మాజీ దిగ్గజం**

**అతడేమైనా 1 లేదా 2 పరుగులు చేశాడా అని ప్రశ్న**

**సిరాజ్ చప్పట్లు కొట్టి ఉంటే బావుండేదన్న సునీల్ గవాస్కర్**




అడిలైడ్ వేదికగా భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ అద్భుతంగా రాణించాడు. 140 పరుగులతో అదరగొట్టాడు. టెస్టుల్లో వన్డే తరహా బ్యాటింగ్ చేసిన అతడిని భారత పేసర్ మహ్మద్ సిరాజ్ పెవిలియన్‌కు పంపించాడు. చక్కటి 'లో ఫుల్ టాస్' బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో సిరాజ్ ఎగిరి గంతేశాడు. ఆనందంతో కూడిన ఆవేశానికి లోనయ్యాడు. ట్రావిస్ హెడ్‌కు కోపంతో పెవిలియన్ వైపు దారి చూపించాడు. దీంతో హెడ్ కూడా తిట్టుకుంటూ మైదానాన్ని వీడాడు. దీంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది. అయితే మహ్మద్ సిరాజ్ ప్రవర్తనను భారత మాజీ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తప్పుబట్టారు.

అద్భుతంగా ఆడి 140 పరుగులు సాధించిన ఆటగాడిగా ఈ తరహాలో కోపంతో సెండ్ ఆఫ్ ఇవ్వాల్సిన అవసరం లేదని సునీల్ గవాస్కర్ వ్యాఖ్యానించారు. సిరాజ్ ఈ విధంగా ప్రవర్తించడం అనవసరమని విమర్శించారు. " నన్ను అడిగితే ఇలాంటి సెండ్ ఆఫ్ అనవసరం. అతడు 140 పరుగులు సాధించాడు. అతనేమీ ఒకటి లేదా రెండు పరుగులు చేసి ఔట్ కాలేదు కదా. అద్భుతంగా బ్యాటింగ్ చేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న బ్యాటర్‌కు ఎవరూ ఈ విధంగా సెండ్-ఆఫ్ ఇవ్వరు. హెడ్‌ని ఔట్ చేసిన సిరాజ్ హీరోగా కాకుండా విలన్‌గా మారాడు. పైగా తన చర్యలతో స్థానిక ప్రజల గౌరవాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయాడు. ఆ అవుట్ తర్వాత హెడ్‌ని అభినందిస్తూ సిరాజ్ చప్పట్లు కొట్టి ఉంటే స్టేడియంలోని ప్రతి ఒక్కరికీ అతడు కూడా హీరో అయ్యేవాడు. అయితే అందుకు విరుద్ధంగా సిరాజ్ విమర్శల పాలవుతున్నాడని అర్థం చేసుకోవచ్చు" అని సునీల్ గవాస్కర్ వ్యాఖ్యానించారు.

ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హెడెన్ కూడా సిరాజ్ చర్యలను తప్పుబట్టాడు. బౌలర్‌గా వికెట్ తీయడం ఎవరికైనా సంతోషకరమే, అయితే సిరాజ్ కొంచెం భావోద్వేగానికి గురైనట్టుగా అనిపిస్తోందని విమర్శించాడు. 140 పరుగులు చేసిన లోకల్ ఆటగాడైన ట్రావిస్ హెడ్‌ని ఎదుర్కొనేటప్పుడు కాస్త వినయం చూపాలి కదా అని హెడెన్ సలహా ఇచ్చాడు. హెడ్ ప్రదర్శనను హెడెన్ మెచ్చుకున్నాడు.

## వినోద్ కాంబ్లీ నా కొడుకులాంటివాడు.. అతడిని ఆదుకుంటాం: సునీల్ గవాస్కర్

**ఇటీవల వరుసగా వైరల్ అయిన వినోద్ కాంబ్లీ వీడియోలు**

**అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కాంబ్లీ**

**ఇటీవల ముంబైలో ఓ కార్యక్రమంలో సచిన్ చేయి పట్టుకుని వదిలేందుకు నిరాకరించిన కాంబ్లీ వీడియో వైరల్**

**గతంలో నడవడానికి కూడా ఇబ్బంది పడిన మాజీ క్రికెటర్**

**అతడిని ఆదుకుంటామన్న దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్**

**1983 జట్టు కాంబ్లీని ఆదుకుంటుందన్న సునీల్ గవాస్కర్**




అనారోగ్యంతోపాటు ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న టీమిండియా మాజీ బ్యాటర్ వినోద్ కాంబ్లీ బాగోగులను 1983లో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు చూసుకుంటుందని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ హామీ ఇచ్చాడు. 1983 ప్రపంచకప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ ఇటీవల ఇలాంటి హామీనే ఇచ్చాడు. ఇప్పుడు గవాస్కర్ కూడా అటువంటి ప్రకటనే చేశాడు.

ముంబైలో ఇటీవల సచిన్, వినోద్ కాంబ్లీ చిన్ననాటి కోచ్ రమాకాంత్ అచ్రేకర్ స్మారక కార్యక్రమం నిర్వహించారు. దీనికి సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య స్నేహితులైన సచిన్, కాంబ్లీ కలుసుకున్న వీడియో వైరల్ అయింది. టెండూల్కర్ చేయి పట్టుకున్న కాంబ్లీ వదిలేందుకు నిరాకరించినట్టుగా ఉన్న ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అలాగే, కాంబ్లీ బాలీవుడ్ పాట పాడుతున్న మరో వీడియో కూడా సోషల్ మీడియాకెక్కింది. అయితే, ప్రసంగంలో మాత్రం కొంత ఇబ్బంది పడడం కనిపించింది. అంతకుముందు ఆగస్టులో వైరల్ అయిన వీడియోలో కాంబ్లీ నడవడానికి కూడా ఇబ్బంది పడడం కనిపించింది.

ఈ నేపథ్యంలో కాంబ్లీని తన 'కుమారుడి'గా అభివర్ణించిన గవాస్కర్.. 1983 ప్రపంచకప్ సాధించిన భారత జట్టు సభ్యులందరూ కలిసి కాంబ్లీ బాగోగులు చూసుకుంటారని చెప్పుకొచ్చాడు. "యువ ఆటగాళ్ల విషయంలో 1983 జట్టు ఆందోళనగా ఉంది. నా వరకు చెప్పాలంటే వారు నా మనవళ్లు, కొడుకుల్లాంటి వారు. దురదృష్టం వెంటాడిన అలాంటి క్రికెటర్ల విషయంలో మేం ఆందోళన చెందుతున్నాం. సాయం అనే పదం నాకు ఇష్టం ఉండదు. 1983 జట్టు కాంబ్లీ బాగోగులు చూసుకోవాలనుకుంటోంది. అతడు తిరిగి నిలబడేలా చేయాలనుకుంటున్నాం" అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

గవాస్కర్ ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో ఉన్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టుకు కామెంట్రీ విధులు నిర్వర్తిస్తున్నాడు. టీమిండియా మాజీ పేసర్ బల్వీందర్ సింగ్ ఇటీవల మాట్లాడుతూ కాంబ్లీ ఆరోగ్యం విషయంలో కపిల్‌దేవ్ తనతో మాట్లాడాడని, అతడికి సాయం చేస్తానని మాటిచ్చాడని చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇప్పుడు గవాస్కర్ కూడా అలాంటి ప్రకటనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కెప్టెన్ రోహిత్ శర్మ చెత్త రికార్డు

**అడిలైడ్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సింగిల్ డిజిటల్ స్కోర్లకే ఔట్**

**ఒకే క్యాలెండర్ ఏడాదిలో ఇలా మూడు సార్లు ఔటైన కెప్టెన్‌గా అవాంఛిత రికార్డు**

**సనత్ జయసూర్య సరసన చేరిన హిట్‌మ్యాన్**




టెస్టు ఫార్మాట్ క్రికెట్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొనేందుకు ఆపసోపాలు పడుతున్నాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్ట్ మ్యాచ్‌కు వ్యక్తిగత కారణాలతో హిట్‌మ్యాన్ అందుబాటులో లేడు. అయితే అడిలైడ్ వేదికగా ప్రస్తుతం జరుగుతున్న రెండవ టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ తీవ్రంగా నిరాశపరిచాడు. సింగిల్ డిజిట్ స్కోర్‌లకే వెనుదిరిగాడు.

రెండవ ఇన్నింగ్స్‌లో 15 బంతులు ఎదుర్కొని 6 పరుగులు మాత్రమే సాధించి ఔట్ అయ్యాడు. రెండవ రోజు ఆట ఆఖరి సెషన్‌లో ఆసీస్ కెప్టెన్ ప్యాట్స్ కమ్మిన్స్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేశారు. బంతి బ్యాట్ ఎడ్జ్‌కి తగిలి నేరుగా ఫీల్డర్ చేతుల్లోకి వెళ్లింది. దీంతో కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఇక తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ పేసర్ స్కాట్ బోలాండ్ చక్కటి బంతితో రోహిత్ శర్మను ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేశాడు. హిట్‌మ్యాన్ కేవలం 3 పరుగులు మాత్రమే చేశాడు.

అడిలైడ్ టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ విఫలమవ్వడంతో రోహిత్ శర్మ పేరిట అవాంఛిత రికార్డు నమోదయింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సింగిల్ డిజిట్ పరుగుకే ఔట్ కావడం రోహిత్ శర్మకు ఇది మూడో టెస్ట్ మ్యాచ్. ఒక క్యాలెండర్ ఏడాదిలో మూడు టెస్టు మ్యాచ్‌ల్లో ఈ విధంగా ఔటైన కెప్టెన్‌గా హిట్‌మ్యాన్ నిలిచాడు. రోహిత్ కంటే ముందు కేవలం ఇద్దరు కెప్టెన్లు మాత్రమే ఈ చెత్త ప్రదర్శనను నమోదు చేశారు. శ్రీలంక మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య, బంగ్లాదేశ్ ఆటగాడు మోమినుల్ హక్ ఈ జాబితాలో ఉన్నారు. 2001లో జయసూర్య, 2022లో మోమినుల్ ఇద్దరూ చెరో మూడు టెస్ట్ మ్యాచ్‌ల్లో తీవ్రంగా నిరాశపరిచారు. కాగా అడిలైడ్ టెస్ట్ మ్యాచ్ రెండవ ఇన్నింగ్స్‌లో 128 పరుగులకే 5 వికెట్లు కోల్పోవడంతో భారత్ తీవ్ర కష్టాల్లో పడిన విషయం తెలిసిందే.

# పురాణపూల్ చౌరస్తా ధగర ఉన్న గాంధీ విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి ఫోటో కి పాలాభిషేకం చేసిన

## కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీమతి పరమేశ్వరి సింగ్



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మంగళ్‌హట్ డివిజన్ పూరాణాపూల్ చౌరస్తా లో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీమతి పరమేశ్వరి సింగ్ నేతృత్వంలో పురాణపూల్ చౌరస్తా ధగర ఉన్న గాంధీ విగ్రహం ముందు మన ప్రియతమ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఫోటో కి పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు ఒక సంవత్సరం ఉత్సవం లో భగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీమతి పరమేశ్వరి సింగ్ మాట్లాడుతూ సోమవారం డిసెంబర్ 9న నెక్లెస్ రోడ్ సెక్రెటేరియట్ లో సాయంత్రం 5గంటలకు తెలంగాణా తల్లి విగ్రహ ఆవిష్కరణ మరియు బహిరంగ సభలో ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి పాల్గోనే సభలో గోషామహల్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గోనాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అజ్జు ఠాకూర్, భద్రినాథ్, ముంద్రాయి శ్రీనివాస్, కైలాష్ సింగ్, శశి రాజ్ సింగ్, ఖదీర్,



వెంకటేష్, అనిల్, జె మల్లేష్ ,ధర్మేష్ సునీల్ సాహు,గులాభ్ సింగ్, శోభా బాయి, రేణుక శంకరమ్మ పి శాంత పాల్గొన్నారు

# తాజా మాజీ సర్పంచుల JAC తెలంగాణ రాష్ట్రం. పేరుకే ప్రజా పాలన /నడిచేదంతా కార్పొరేట్ పాలన

## రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్



సర్పంచ్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయకుంటే పల్లె బట కార్యక్రమం చేపట్టి ప్రజల మధ్యకు వెళ్ళుతాం

డిసెంబర్ 9వ తారీకు నుండి జరగబోవు అసెంబ్లీ సమావేశాలలో సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లుల అంశంపై మాట్లాడాలని ప్రతిపక్ష నాయకులందరికీ వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా సర్పంచ్ల యొక్క పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం కక్ష సాధింపు చర్యగా మేం భావిస్తున్నాం.

గత సంవత్సర కాలం నుండి వినతి పత్రాలు ఇస్తూ శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నాము కానీ ఎలాంటి స్పందన లేదు.

ఇప్పటికే ఈ రాష్ట్ర ప్రభుత్వం లక్ష కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతుంది, అదే విధంగా గత ప్రభుత్వ అప్పులకు ప్రతినెల 5000 కోట్ల రూపాయల మిత్తులు కూడా కట్టడం జరుగుతుంది.

కానీ సర్పంచులకు రావాల్సిన 1,000 కోట్లు మాత్రం విడుదల చేయకపోవడం ఇది చాలా బాధాకరమైన విషయం.

సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తలేదు కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచులను ఏకం చేసి అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతు కూడగట్టుకొని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించడం జరిగింది.

అసెంబ్లీ సమావేశాలలో సర్పంచుల పెండింగ్ బిల్లులలు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా పల్లెబాట కార్యక్రమం చేపట్టి సర్పంచ్ల యొక్క పెండింగ్ బిల్లులో మరియు ప్రభుత్వం యొక్క ఆరు గ్యారెంటీ లపై ఎండ ఎండగడతామని హెచ్చరించడం జరిగింది.

అయినా ఈ ప్రభుత్వంలో స్పందన రాకపోతే డిసెంబర్ 27 తారీకు నాడు అమరవీరుల స్తూపం దగ్గర ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని తెలియజేయడం జరిగింది.

సంవత్సరం గడిచి సందర్భంగా ప్రజా పాలనలో ప్రజా ఉత్సవాలు అని జరుపుకుంటున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చి ఈ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమి లేదని చెప్పేసి ఎద్దేవ చేయడం జరిగింది.

ఒకవైపు రాష్ట్ర ప్రజలు జీవితాలు రోడ్ల మీద పడ్డాయి, అదేవిధంగా ఆరు గ్యారెంటీల అమలు లేదు, హాస్టల్లో ఫుడ్ పాయిజన్ తో చనిపోయినటువంటి పిల్లల బాధలు ఒకవైపు ఉంటే ఈ రాష్ట్రంలో ఏదో అద్భుతాలు చేసినట్టు విజయోత్సవాలు చేసుకోవడం ఆస్పేస్పదంగా ఉందని చెప్పేసి మాట్లాడడం జరిగింది

కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అకెనపెల్లి కరుణాకర్, చెన్నమనేని స్వయంప్రభ, దుమ్మ అంజయ్య, గున్నాల లక్ష్మణ్, కెంద గంగాధర్, మల్యాల దేవయ్య, ఆరె మహేందర్, లింగంపల్లి కరుణాకర్, రాసురి రాజేష్, కాదస్ సంతోష్, రంగు రాములు తదితరులు పాల్గొన్నారు.



## ఏడాది కాలం లొ మా కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సృష్టించింది. హాఫీజ్ మొల్సాబ్ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ మెదక్.

ఏడాది పాలనలో వ్యవసాయ రుణాలమాఫీ, పంట బోనస్, ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సృష్టించ్చిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫీజ్ మొల్సాబ్ అన్నారు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూపాయలు 500లకే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ ల వరకు ఉచిత విద్యుత్, రూ 21వేల కోట్ల రుణ మాఫీ, సన్న వడ్లకు 500రూ బోనస్, 55వేల ఉద్యోగాలు అందించమని తెలిపారు, కాంగ్రెస్ పార్టీ పై నమ్మకం ఉంచిన తెలంగాణ ప్రజలకు అయన ధన్యవాదములు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ పర్యటన ను విజయవంతం చేయండ

### బొబ్బిళ్ళపాటి బాబురావు కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ నాయకులు



ఖమ్మం ప్రతినిధి డిసెంబర్ 8 (ప్రజాబలం) ఖమ్మం ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ 12/ 12/ 24 తేదీన విధారణ కమిషన్ చైర్మన్ గౌరవ డాక్టర్ జస్టిస్ షామీమ్ అత్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ పర్యటన విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ నాయకులు బొబ్బిళ్ళపాటి బాబురావు పిలుపునిచ్చారు షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై వివర్ణాత్మక అధ్యయనం కోసం ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని బహిరంగ విచారణ కు 12/ 12/ 24న ఖమ్మం జిల్లాకు విచ్చేయుచున్నారు కావున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎస్సీ కుల సంఘ నాయకులు, ఉప కులాల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ విచారణకు ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం నందు హాజరై తమ తమ వినతులు ఇవ్వాలని కోరుచున్నాము యొక్క విచారణ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏక సభ్య కమిషన్ చైర్మన్ గౌరవ డాక్టర్ జస్టిస్ షామీమ్ అత్తర్ పాల్గొని వినతులు స్వీకరిస్తారు

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 8: శివ సాయి ఫంక్షన్ హాల్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి.

177 మంది లబ్ధిదారులకు రూ. కోటి 79 లక్షల చెక్కులను పంపిణీ చేసిన మహేందర్ రెడ్డి.

పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే చేమకూర మల్లారెడ్డి,సీనియర్ నాయకుడు వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ యాదవ్.

మేడ్చల్ నియోజకవర్గం లో 584 మంది లబ్ధిదారులకు రూ. 5 కోట్ల 90 లక్షల కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె నారాయణరావు




ఖమ్మం ప్రతినిధి డిసెంబర్ 8 (ప్రజాబలం) ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం నందు ఘనంగా ప్రారంభమైన స్తంభాద్రి ప్రీమియర్ లీగ్ 6 క్రికెట్ పోటీలు స్తంభాద్రి మెడికల్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ గా డాక్టర్ కుసుమరాజు రవి కుమార్ ఆధ్వర్యంలో స్తంభాద్రి ప్రీమియర్ లీగ్ 6 నిర్వహిస్తున్నఈ క్రీడలను ప్రారంభించడాని కి ముఖ్యఅతిథిగా ఖమ్మం ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కే నారాయణ రావు జనరల్ సెక్రటరీ డాక్టర్ జగదీష్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ డాక్టర్ ఎం జీవి ప్రవీణ్ డాక్టర్ ఆర్ రవి కుమార్ డాక్టర్ జంగాల సునీల్ కుమార్ డాక్టర్ నందనందన్ డాక్టర్ గోపగాని సురేందర్ డాక్టర్ రాజ్ కుమార్ మరియు ఖమ్మం నగరంలోని ప్రముఖ డాక్టర్లు హాజరైన ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కే నారాయణ రావు జ్యోతి ప్రజ్వలన చేసిన తర్వాత జాతీయ గీతం ఆలపించి తర్వాత క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఖమ్మం నగరం లోని ప్రయివేటు హాస్పిటల్ స్టాఫ్ అందరిని ఐక్యం చేసే పనిలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడలు ఖమ్మం వైద్య రంగానికి మంచి పరిణామమని పేర్కొన్నారు రాబోయే రోజుల్లో మరింత ఐక్యత తో పనిచేసేందుకు స్తంబాద్రి మెడికల్ అసోసియేషన్ కు ఖమ్మం ఐఎంఏ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. స్తంబాద్రి మెడికల్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ డా. కుసుమరాజు రవి కుమార్ మాట్లాడుతూ ప్రయివేట్ హాస్పిటల్ లో పనిచేసే ప్రతి ఉద్యోగి ఆయమ్మ నుండి మొదలుకుని మేనేజర్ స్థాయి ఉద్యోగి వరకు ఐక్యమత్యమే లక్ష్యంగా ఈ అసోసియేషన్ ఏర్పడిందని అన్నారు. 2017 లో ఏర్పడిన ఈ సంస్థ ఇప్పటి వరకు 5 దఫాలుగా





క్రీడలు నిర్వహించుకుని 6 వ దఫా ఇప్పుడు నిర్వహించడం జరుగుతుందని అన్నారు ఈ క్రీడలు నిర్వహించుటకు ఆర్థికంగా హార్దికంగా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపుతున్నామని అన్నారు. ఈ విదంగా సేకరించిన విరాళాల ద్వారా క్రీడలు నిర్వహించడం కాకుండా మెడికల్ ఫిల్డ్ లో పనిచేసే నిరుపేద కుటుంబాలకు నిరుపేద పిల్లల చదువుల కోసం మరియు అనారోగ్యంతో బాధపడే వారికి ఆర్థిక తొడ్పాటుకు ఉపయోగిస్తున్నామని అన్నారు. అలాగే మొన్న ఖమ్మం నగరానికి వచ్చిన మున్నేరు వరదబాధిత మెడికల్ స్టాఫ్ కుటుంబాలకు కూడా ఆర్థికంగా మరియు వస్తురూపేణా సహకరించడం జరిగిందని అన్నారు. అలాగే రాబోయేరోజుల్లో మరిన్ని కార్యక్రమాలు ఈ అసోసియేషన్ ద్వారా నిర్వహిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో స్తంబాద్రి మెడికల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు జాగర్లమూడి ప్రసాద్ విష్ణు నరేష్ గౌస్ పాషా సాధిక్ హమీద్ అర్కా వెంకట్, వీర కుమార్ వెంకట్ శ్రావణ్ నరేష్ సుధీర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన సింగిరెడ్డి సోమిరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ కి హాజరైయారు..



నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:నకిరేకల్ పట్టణానికి చెందిన తండు పున్నయ్య కుమార్తె వివాహానికి హాజరైయారు..



నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి: చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి బుర్రి శేఖర్ రెడ్డి కుమార్తె వివాహానికి హాజరైయారు..

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**అనారోగ్యంతో బాధపడుతు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం నాడు లబ్ధిదారులకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపంపిణీ చేశారు..**



నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన గుండ్లపల్లి మంగమ్మ కి మంజూర్కైన 52 వేల రూపాయల చెక్కును.,



నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:పోచంపల్లి గ్రామానికి చెందిన చిందం వెంకటేష్ కి మంజూర్కైన 30 వేల రూపాయల చెక్కును.,



నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి: కుంట్లూర్ కి చెందిన కలీం పాశ కి మంజూర్కైన 60 వేల రూపాయల చెక్కును అందజేశారు..

## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన

### త్వరలో పోరాట కార్యాచరణ

### పెన్షనర్ల సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు

ఖమ్మం ప్రతినిధి డిసెంబర్ 8 (ప్రజాబలం) ఖమ్మం అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల -సమస్యల పరిష్కారం పట్ల నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం -ఆధ్వర్యంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య -అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించి నాలుగు విడతల డిఏ పెండింగ్లో ఉందని -సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు నగదు రహిత వైద్యం గురించి పదే పదే చెబుతున్నప్పటికీ అమలు కావడం లేదని, వృద్ధాప్యంలో అనారోగ్య పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నగదు రహిత వైద్యం అందక పెన్షనర్లు తీవ్ర -ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రబాబు తెలిపారు. తక్షణం పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇటీవల కాలంలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షనర్ల బెన్ఫిట్స్ అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని మార్చిలో పదవి విరమణ పొందిన వారికి సైతం ఇప్పటి -వరకు బెన్ఫిట్సన్ను ప్రభుత్వం అందించడం లేదని పదవి విరమణ పొందిన వెంటనే ఆర్థిక ఇతర విషయాలను -అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. పిఆర్సి అమలులో సైతం జాప్యంజరుగుతుందని ప్రస్తుత ముఖ్యమంత్రి పిఆర్సిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకునేవిధంగా సత్వరం ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. పై -డిమాండ్ల సాధనకు తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో త్వరలో ఆందోళనబాట పడతామని ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించుకున్నట్లు రాజేంద్రబాబు తెలిపారు. ఇతర సంఘాలను కలుపుకుని జేఏసిగా ఏర్పడడం జరిగిందని ఉమ్మడి ఎజెండాతో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాడుతుందన్నారు. ఈ సదస్సులో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, సీనియర్ ఉపాధ్యక్షులు వి. రాంమనోహర్, దేశ్ పాండే, వి. -మనోహర్రాజు, నాగిరెడ్డి తదితరులు ప్రసంగించగా కొల్లికొండ శరత్ బాబు సభకు స్వాగతం పలికిన ఈ సమావేశంలో కె. -సుధీర్ బాబు యాదయ్య, అంజయ్య సూర్యనారాయణ ఆళ్ల రామారావు నర్సయ్య కె. కృష్ణమూర్తి వెంకటేశ్వర్లు, రవికుమార్, -భాస్కరాచారి, శరత్బాబు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముందు మహాత్మగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు -పూలమాలలు వేసి నివాళులర్పించారు





## సైబర్ క్రైమ్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం



జమ్మికుంట ప్రజబలం ప్రతినిది డిసెంబర్ 8సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,బండి మీద వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ ఆంక్షలను పాటించాలని జమ్మికుంట ఎస్సై ఆరోగ్యం తెలిపారు.జమ్మికుంట మండల పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామములో సాయంత్రం సైబర్ క్రైమ్ మోసాలా పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.నేను సైతం కార్యక్రమంలో సోలార్ సీసీ కెమెరాల పట్ల ప్రజల మరింత బాధ్యతగా ముందుకు వెళ్లాలని, దాతలు సహకరించాలని, మంచి కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పోలీసు జలీల్,సోని,బ్లూ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ రైల్వే స్టేషన్ సిగ్నల్స్‌లో సమస్య - నిలిచిపోయిన పలు రైళ్లు






ఉప్పల్, డిసెంబర్ 8(భారత్ సమాచార్)హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో సిగ్నల్స్?లో సాంకేతిక సమస్య తలెత్తడంతో పలు రైళ్లు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. హైదరాబాద్ నుంచి నాగ్‌పుర్ వెళ్లే వందే భారత్, దిల్లీ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు అరగంట పాటు నిలిచిపోయాయి. సిర్పూర్ కాగజ్?నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్?ప్రెస్?లు గంటన్నర పాటు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ఉప్పల్ స్టేషన్‌లో సింగరేణి ప్యాసింజర్ 20 నిమిషాలుగా ఆగిపోయింది. మెయిన్‌లైన్‌లో గూడ్స్ రైలు కూడా ఆగింది. మరోవైపు సిగ్నలింగ్ సమస్య కారణంగా ఉప్పల్ ఆర్వోబీ సమీపంలో రైల్వే గేటు తెరుచుకోకపోడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రెండు వైపులా గేట్లు తెరుచుకోకపోవడంతో హుజురాబాద్ చుట్టుపక్కల ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పరకాల వెళ్లే ప్రయాణికులు గేటు దాటి అవతల ఉన్న బస్సుల్లో ప్రయాణం కొనసాగిస్తున్నారు. హుజురాబాద్ వెళ్లే ప్రయాణికులు ఇవతల వైపుకు వచ్చి వారి గమ్యస్థానాలకు వెళ్తున్నారు. రైల్వే అధికారులు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ డిసెంబర్ 8:కాసిపేట మండలంలోని కొండాపూర్ యాప గ్రామ పంచాయతీలోని రైస్ మిల్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేముల కృష్ణ అధ్యక్షతన ఆదివారం యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలలో గెలుపొందిన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రావుల అనిల్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చల్లగొండ రాజ్ కుమార్, కాసిపేట మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, బెల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ సొప్పరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఇమ్ము, జిల్లా కార్యదర్శులు భుక్య సాయి పున్నం, భోగ శ్రావణ్ లను సన్మానించారు. ఈ సందర్భంగా వేముల కృష్ణ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ఎన్నికలలో ప్రేమ్ సాగర్ రావు బలపరిచిన అభ్యర్థులను కష్టపడి గెలిపించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కష్టపడ్డవారిని కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని వారికి ప్రేమ్ సాగర్ రావు, సురేఖమ్మ లు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. జిల్లా అధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ ఎన్నికలలో కష్టపడి పని చేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు బాల్ మంచ్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ బాబు, మైనార్టీ మండల అధ్యక్షుడు శాకీర్, యాప గ్రామ అధ్యక్షుడు చారి, ధర్మరావుపేట గ్రామ అధ్యక్షుడు గోపే శ్రీను, కన్నక రాజు, చిలుకయ్య, పంబల తిరుపతి, శ్రీధర్, నరేష్, రాజు నాయకులు పాల్గొన్నారు.

# నిషేధమున్నా హైదరాబాద్ నగరంలో హుక్కా కేంద్రాలు -



హైదరాబాద్, డిసెంబర్ 8(భారత్ సమాచార్)హైదరాబాద్?లో హుక్కా కేంద్రాల దందా ఆగడం లేదు. తెలంగాణ ప్రభుత్వం నిషేధం విధించినా అనేక ప్రాంతాల్లో గుట్టుగా ఈ దందా కొనసాగుతోంది. కేఫేలు, పార్లర్లు, రెస్టారెంట్ల పేరుతో అపార్టుమెంట్లు, కాలనీల్లో అడ్డగోలుగా వీటిని నడిపిస్తున్నారు. నేరగాళ్లు తమ గుట్టు బయటపడకుండా తెలిసిన వ్యక్తుల్ని మాత్రమే అనుమతిస్తున్నారు.

ముఖ్యంగా పాతబస్తీ, పరిసర ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా నడుస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో హుక్కా కేంద్రాల్ని నిషేధిస్తూ చట్టం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా పోలీసు తనిఖీల్లో తరచూ హుక్కా దందా వెలుగు చూస్తుంది. ఈ నెల 4న మహేశ్వరం ఎస్?వోటీ పోలీసులు బాలాపూర్ ఠాణా పరిధిలోని బర్మాకాలనీలో తనిఖీలు చేసినప్పుడు ఓ హుక్కా కేంద్రాన్ని గుర్తించారు.

పరిచయస్థులకే అనుమతి గతంలో హైదరాబాద్?లోనే ఎక్కువగా హుక్కా కేంద్రాలుండేవి. పొగాకు ఉత్పత్తులు వాడొద్దని నిబంధనలున్నా పట్టించుకునేవారు కాదు. మైనర్లను అనుమతించడంతో పాటు అనైతిక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తరచూ పోలీసుల తనిఖీల్లో బయటపడేది. పొగాకు ఉత్పత్తులతో పాటు మద్యం, గంజాయి, డ్రగ్స్ వినియోగం ఉంటుందని గుర్తించారు.

వీటితో యువత చెడిపోతున్నారని నివేదించడంతో ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా దందా ఆగడంలేదు. గుట్టుగా హుక్కా కేంద్రాలను కొనసాగిస్తున్నారు. అపార్టుమెంట్లు, కాలనీల్లోని ఇళ్లల్లో నిర్వహిస్తున్నారు. తెలిసిన వ్యక్తులను మాత్రమే అనుమతిస్తూ దందా చేస్తున్నారు. ఏ మాత్రం అనుమానమొచ్చినా వెంటనే అడ్డా మార్చేస్తున్నారు.

హుక్కా కేంద్రాల వెనుక వసూళ్ల దందా : హైదరాబాద్?లోని కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా హుక్కా కేంద్రాలు నడపడానికి నిఘా వైఫల్యం కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. పదుల సంఖ్యలో యువకులు తరచూ హుక్కా సెంటర్?లకు వెళ్తున్నా గుర్తించడం లేదని వసూళ్లకు పాల్పడుతూ కొంత మంది సిబ్బంది చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొందరు హోటళ్ల పైభాగంలో రహస్యంగా రూములను ఏర్పాటు చేసి మైనర్లను ఆకర్షించుకుంటున్నారు. విదేశీ సిగరెట్లు అమ్ముతున్నారు. బహదూర్పురలోని ఓ కేఫ్‌లో పోలీసులు సోదాలు నిర్వహించగా.. హుక్కా కేంద్రం గుట్టు బయటపడింది. వనస్థలిపురంలో ఓ కేఫ్ నిర్వాహుడు హుక్కా కేంద్రం నిర్వహిస్తూ మూడుసార్లు పోలీసులకు దొరికాడు.

# భారత విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో విమానయాన భద్రతను కల్పించేందుకు క్వాలిటీ కంట్రోల్ యూనిట్‌ను ప్రారంభించిన సీఐఎస్ఎఫ్




8డిసెంబర్ 2024 %అంతర్గత నాణ్యతా నియంత్రణ విభాగం (ఐక్యూసీయూ) ఏర్పాటు చేసి, దేశంలోని 68 విమానాశ్రయాల్లో విమానయాన భద్రతా దళం (ఏఎస్‌జీ) అందించే భద్రతను మెరుగుపరిచేందుకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కీలకమైన ముందడుగు వేసింది. ప్రపంచ స్థాయి భద్రతా విధానాలు, సాంకేతికతలను రూపొందించడంలో ఇందులో ఐక్యూసీయూ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సంస్థ పౌర విమానయాన భద్రతా సంస్థ (బీసీఏఎస్) జారీ చేసిన జాతీయ పౌర విమానయాన భద్రత నాణ్యతా నియంత్రణ కార్యక్రమం -2024 (ఎన్‌సీఏఎస్‌క్యూసీపీ), ఎయిర్ క్రాఫ్ట్ (భద్రత) నియమాలు - 2023కి అనుగుణంగా పనిచేస్తుంది.

కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా జులై 22, 2023న ప్రారంభించిన విమానయాన భద్రతా నియంత్రణా కేంద్రం (ఏఎస్‌సీసీ)లో ఐక్యూసీయూ అంతర్భాగంగా ఉంటుంది. ప్రమాద నిర్వహణ కేంద్రం (ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సెంటర్), విమానయాన పరిశోధన, సమాచార కేంద్రం, కేంద్రీకృత సమాచార నియంత్రణ కేంద్రం లాంటి అధునాతన విభాగాలతో భారత విమానాశ్రయాల్లో భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి, భద్రతా వ్యవస్థను మెరుగుపరచడానికి ఐక్యూసీయూతో ఏఎస్‌సీసీ కలిసి పని చేస్తుంది. ఈ వ్యవస్థ ప్రాంతీయ అనుసంధాన పథకం (ఉడాన్) ద్వారా విమానాశ్రయాలకు భద్రత అందిస్తుంది.

ధ్రువీకరణ పొందిన విమానయాన భద్రత (ఏవీఎస్ఈసీ) బోధకులు, జాతీయ ఆడిటర్లు, అనుభవజ్ఞులైన సిబ్బందితో కూడిన బృందానికి ఐక్యూసీయూకి సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారి నాయకత్వం వహిస్తారు. వారు పాల్గొనే కార్యకలాపాలు:

విధానాల ప్రామాణీకరణ: ప్రామాణిక శిక్షణ, మూల్యాంకన పద్ధతుల ద్వారా అన్ని విమానాశ్రయాల్లో పాటించే భద్రతా విధానాల్లో ఏకరూపతను నిర్ధారించడం.

సాంకేతిక అభివృద్ధి: క్షేత్ర స్థాయి ప్రయత్నాలు, అంతర్జాతీయ స్థాయిలో పాటిస్తున్న ఉత్తమ విధానాల ఆధారంగా కొత్త సాంకేతికతల వినియోగాన్ని సూచించడం.

అంతర్గత తనిఖీలు: భద్రతా కార్యకలాపాలను అంచనా వేయడానికి, దిద్దుబాటు చర్యలను అమలు చేయడానికి ఐసీఏవో/బీసీఏఎస్ మార్గదర్శకాల ఆధారంగా అంతర్గత తనిఖీలు, ఆడిట్‌లను నిర్వహించడం.

నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ: పర్యవేక్షణ, సమీక్షించడం ద్వారా నిర్దేశించిన ప్రమాణాలను చేరుకోవడానికి, వాటిని సక్రమంగా అమలు చేసేందుకు, సాంకేతిక ప్రభావాన్ని, నిర్వహణా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు భద్రతా విధివిధానాలను ఆధునికీకరించడం

అభిప్రాయ విశ్లేషణ: అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏవో), బీసీఏఎస్, ఎన్‌సీఏఎస్‌క్యూసీపీ ప్రమాణాలకు అనుగుణంగా లోపాలను గుర్తించి, పనితీరును మెరుగుపరిచేందుకు ఏఎస్‌జీల నుంచి అభిప్రాయాలను సేకరించి, విశ్లేషించడం.

భద్రతా కార్యకలాపాల ప్రభావాన్ని పెంపొందించడానికి, ప్రమాదాలను తగ్గించడానికి, పటిష్టమైన, స్థిరంగా ఉండే విమానయాన భద్రతా వ్యవస్థను నిర్వహించడానికి సీఐఎస్ఎఫ్ కట్టుబడి ఉంది.

## ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల సందర్భంగా తేదీ. 9.12.2024 కార్యక్రమాలు

ముఖ్యమంత్రి చే తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ - 5.00 PM - సచివాలయంలో.

బహిరంగ సభ గౌరవ ముఖ్యమంత్రి - 5.00 PM - 5.45PM సచివాలయంలో

డ్రోన్ షో - 5.45 PM - 6.00PM

బాణసంచా - 6.05 PM - 6.20PM

గౌరవ ముఖ్యమంత్రి - కల్చరల్ వేదికలో థమన్ మ్యూజికల్ నైట్ వద్దకు చేరుకుంటారు - 6.10 PM

ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల సందర్భంగా తేదీ. 9.12.2024 నా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు

( వేదిక : నెక్లెస్ రోడ్,HMDA గ్రౌండ్స్, ఉచిత ప్రవేశం అందరికీ)

1.సాంస్కృతిక కార్యక్రమాలు - మూడు వేదికలు (5 - 9PM) నెక్లెస్ రోడ్.

సంగీత కచేరీ - శ్రీ ఎస్ తమన్ - 7.00PM - 8.30PM - HMDA% గ్రౌండ్స్ ఇమాక్స్.

సాంస్కృతిక కార్యక్రమాలు - 5.00PM - 9.00PM.

ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ - ఉదయం - రాత్రి వరకు.

2.సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు :


ఒడిస్సీ - సుదీప్త పాండా అండ్ టీమ్ -6.00 PM - 7.00PM - వేదిక - రాజీవ్ విగ్రహం

ఫ్యూజన్ - అర్జ్హ వర్షిణి అండ్ టీమ్ - 7.00 PM - 7.45PM - వేదిక - రాజీవ్ విగ్రహం

మాజిక్ - జనార్ధన్ కేసమోని - 7.45 PM- 8.30 PM - వేదిక - రాజీవ్ విగ్రహం

ఒగ్గు డోలు విన్యాసం - ఎం.అశోక్ అండ్ టీమ్ %- 8.30PM - 9.00PM - వేదిక - రాజీవ్ విగ్రహం

# తల్లి తన స్వంత కుమారులపై కేసు నమోదు..........



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500
1. District Hyderabad P.S. TRIMULGHERRY Year 2024 FIR No. 378/2024 Date 07-12-2024
2. Acts & Section(s): 352 BNS
3. a) Occurrence of Offence: Day Saturday Date & Time From
Date & Time To Prior To 07-12-2024 17:29:59 Time Period

తల్లి తన కుమారులైన డాక్టర్ రాజేష్ కె గట్లేవార్ %వీ.ఐ%. అనస్థీషియాలజిస్టు మరో కుమారుడు ముంబై హెచ్ పి సి ఎల్ లో పనిచేస్తున్న ఇంజనీర్ ముఖేష్ కె గట్లేవార్ పైసికింద్రాబాద్ తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐ ఆర్ నమోదు చేసింది.తన కుమారులు తనను రాయడానికి వీలుకాని భాష లో దుర్భాషలాడి అవమానించినందున తాను తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తిరుమలగిరి దుర్గా విహార్ కాలనీలో డాక్టర్ రాజేష్ మరియు సికింద్రాబాద్ సఫిల్‌గూడలో ముఖేష్ నివాసముంటున్నారు . 82 సంవత్సరాల వయస్సు గల తల్లిని ఆమె కుమారులు వేధించడమే కాకుండా ఆమె అన్ని వస్తువులను తీసుకోవడానికి ఆమెను అనుమతించలేదు. పోలీసు పెట్రోలింగ్ వారు అవసరమైన ఆమె వస్తువులను ఆమెకు తిరిగి ఇవ్వమని 3-4 సార్లు 17.11.24 న హెచ్చరించిన దరిమిలా పోలీసు పెట్రోలింగ్ సమక్షంలో ఆమె వస్తువులను తీసుకోవడానికి అనుమతించారు. డాక్టర్ రాజేష్ కె గట్లేవార్,ముఖేష్ కె గట్లేవార్‌లపై తగు చర్యలు తీసుకోని తనకు న్యాయం చేయాలని ఆమె పోలీస్ వారిని కోరింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com